# మన'సు'కవి



# మన ' సు ' కవి

(వ్యాస సంపుటి)

తలతోటి పృథ్విరాజ్

S A T Y A
PUBLICATIONS

సత్య పబ్లికేషన్స్

టి.సత్యానందం,సంజీవ నగర్,అద్దంకి-523 201

# MANA 'SU' KAVI

## మన'సు'కవి(వ్యాస సంకలనం)

© Talathoti Prithvi Raj

First Impression : Dec 1998
Copies : 1,000
Price : 30/-

For Copies:

Dr.T.Prithvi Raj,
Door No.6-5,
6th Street,Sarada Nagar,
Anakapalle-531001

Dr.Talathoti Prithvi Raj,
Lecturer in Telugu,
A.M.A.L.College,
ANAKAPALLE-531001
CELL:9963299452

Printed at
MUDRIKA PRINTERS
48-7-59,Srinagar,VISAKHAPATNAM-530 016

# అంకితం



తన వారసునిగా

ఆత్రేయచే ప్రకటింపబడిన ప్రతిభావంతుడు...

ఆత్రేయనే గురువుగా స్మరించే

కవి

మంచి మనసున్న మనీషి

**శ్రీ జె.కె.భారవి** గారికి

సగౌరవంగా సమర్పితం



## శ్రీమతి పద్మావతి ఆత్రేయ

టి.పృథ్వీరాజ్ వ్రాసిన ఈ పుస్తకం చాలా బాగుంది. ఆత్రేయ గారి పాటలలోని భావాన్ని గుర్తించగలిగారు. ఆత్రేయగారు 'మనసు' గురించి ఇన్ని విషయాలు చెప్పారని నేను ఈ రచయిత పుస్తకం ద్వారా తెలుసుకున్నాను. ఇందులోని విమర్శనాత్మక గీతాలను పరిశీలిస్తే - వీరు ఆత్రేయ పాటలమీద వున్న మంచి అవగాహనతో విశ్లేషించిన విధంగా కనిపిస్తుంది. సమాజంలోని అన్యాయాలు, అక్రమాల గురించి ప్రజలలో మార్పు కొరకు ఆత్రేయగారు పడిన ఆవేదనో ఏమిటో నాకు తెలుసు. వారు తన పాటల ద్వారా, మాటల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని ఆశించిన వ్యక్తి. రచయిత ఈ విషయాన్ని వ్యాసాలలో స్పష్టంగా చెప్పారు. మన 'సు' కవి గా ఆత్రేయను చక్కగా విశ్లేషించి పుస్తకరూపంలో తీసుకొని వచ్చినందుకు రచయితకు నా ధన్యవాదాలు.

-శ్రీమతి పద్మావతి ఆత్రేయ

తాడేపల్లి గూడెం,

18-12-1998

# విషయ సూచిక


మనసు కవి ఆత్రేయ

ఆత్రేయ విమర్శనాత్మక గీతాలు

ఆత్రేయ పాటల్లో శృంగారం

ఆత్రేయ వేదాంతం

ఆత్రేయ దైవం

ఆత్రేయ పాటల్లో అమ్మ

ఆత్రేయ ప్రబోధాత్మక గీతాలు

అసామాన్యుడు ఆత్రేయ

# మనసు కవి ఆత్రేయ

ఆత్రేయను చాలా మంది మనసుకవి. 'మన-సు-కవి అని అంటారు. అలా అనడానికి గల కారణాలేమిటి? వారు మనసును ఏవిధంగా విశ్లేషించి చెప్పారు అని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఆత్రేయ కేవలం 'మనసు' అనే పదాన్ని అతని సాహిత్య రచనలో పదే పదే వాడినంత మాత్రాన మనసుకవి కాలేదు. మనో విజ్ఞాన శాస్త్రవేత్తలకు కూడా అంతుచిక్కని మనిషి మనస్తత్వాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని ఎన్నో సిద్ధాంతాలను ప్రతిపాదించిన గొప్ప పరిశోధకుడు. మనోవైద్యుడు ఆత్రేయ.

ఆత్రేయ తన సినిమా సాహిత్య రచనకు ముడి పదార్థాలుగా మనిషి - మనసు - మమతను గ్రహించారు. ఇవి వేరుపరచలేని ఒక మూలకం వంటివి. ఈ మూడు ఒకదానితో ఒకటి అనుసంధానాన్ని, అనుబంధాన్ని కలిగి వుంటాయి. ప్రత్యేకపరచి చూపలేము. ఈ మూడే 'జీవితం' అని గ్రహించిన వారు ఆత్రేయ. కనుకనే వారు ప్రతి పాటలోను మాటలోను మనిషిని - ఆ మనిషి మనసును - ఆ మనసు మనస్తత్వాన్ని,ఆ మనసులోని మమతాను రాగాలను విశ్లేషించి చెప్పారు. వీటన్నింటిని దాదాపు నలభై సంవత్సరాలపాటు వివిధ కోణాల నుంచి పరిశీలించి, పరిశోధించి మానవ సమాజమనే విశ్వ విద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతవ్యాసం వారి సాహిత్యం. అందుకే 'మనసుకవి'గా అదే అతని పేరుగా నిలిచింది. ముఖ్యంగా 'మనసు'ను గూర్చి ఆత్రేయ ఎన్నో విషయాలను చెప్పారు.

మనసు గురించి చెప్పేముందు అసలు మనసు అంటే ఏమిటని ఆత్రేయ మాటల్లోనే తెలుసుకుందాం.

"దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్ " అని గురుజాడ వారు దేశానికి కొత్త అర్థాన్ని ఎలా చెప్పారో, అలాగే..

"మనషులంటే మనసులేరా " [1] అని మనిషికి సరికొత్త అర్థాన్ని చెప్పారు ఆత్రేయ. అంటే మనసున్నటువంటి వారే మనుషులని ఆత్రేయ భావన. ఇంకాస్తముందుకెళ్ళి -

" మనసు మమతే మనిషి" [2] అని అంటారు. " మనసుండటమే మనిషికి సాక్ష్యమని" 'కలియుగరాముడు'లో అంటారు. ఇంకా ఏమి చెప్పారంటే...

'మనసుంటే మన్నించాలి - మనిషంటే మనసుండాలి" [3]

అని నిర్ధారించి చెప్పారు. మనిషికి మనసులేకపోతే మనిషే కాదని 'అభినందన' చిత్రంలో చెప్పారు. 'మనసును చంపుకొని బ్రతకటం అనవసరం." అని దేవదాసు పాత్రద్వారా 'దేవదాసు (కృష్ణ)' చిత్రంలో పలికిస్తారు.

"మనసనేది వట్టి మట్టిముద్ద. ద్వేషం, ప్రేమ అన్నీ మనం చేసుకునే మూసలు, ఏ మూసలో పోస్తే ఆ రూపమే వస్తుంది మనసుకు" అని మనసు స్వరూపాన్ని దాని తత్వాన్ని 'కోడె నాగు' చిత్రంలో చెప్పారు.

'మనసు మూగది మాటలు రానిది

మమత ఒకటే అది నేర్చినది

భాషలేనిది బంధమున్నది .... " [4] అని మనసు లక్షణాలను తెలిపారు ఆత్రేయ. మనసుకు భాషలేదని చెప్పిన ఆత్రేయగారే -

"మనసు మూగదేకాని బాసుంటది దానికి

చెవులుండే మనసుకే ఇనిపిస్తుందా ఇదీ" [5] అని మనసుకూ ఒక భాషనేది ఉన్నట్లు చెప్పారు. మరి మనసు మాట్లాడే భాషకు లిపి ఏమిటంటే సంకేతాలేనంటారు 'న్యాయం మీరే చెప్పాలి ' చిత్రంలో. ఇలాంటి "మనసు బరువెక్కినప్పుడు మాటలు రావని" 'మూగప్రేమ'చిత్రంలో కమల పాత్రద్వారా పలికిస్తాడు. కొన్ని ప్రశ్నలకు మనం సమాధానం చెప్పలేము. మనసు చెబుతుందట! ఆ సమాధానం కన్నీళ్ళతో చెబుతుందని 'దేవదాసు' చిత్రంలో ఆత్రేయ చెప్పారు.

ప్రతిమనిషి మరో మనిషితో స్నేహంచేసినప్పుడే ఒకరి మనస్తత్వం మరొకరికి తెలుస్తుంది. అలా చేయనినాడు మనిషిలో

ఉండే ఆ మనసుకి విలువే వుండదు. అందుకే ఆత్రేయ–

"మనసనేది ఒకరికొకరు ఇచ్చినప్పుడే తెలిసేది, దాచుకుంటే ఎవరికీ అది దక్కకుండా పోతుంది " అని అంటారు. మనసనేది ఎలాంటిది అంటే ...

" ఒకరికిస్తే – మరలిరాదు
ఓడిపోతే – మరచిపోదు
గాయమైతే – మాసిపోదు
పగిలిపోతే – అతుకు పడదు" [6] అని మనసు తత్వాన్ని దాని సున్నితత్వాన్ని చెప్పారు.

" తనువుకెన్ని గాయాలైనా
మాసిపోవు నెలాగైనా
మనసుకొక్క గాయమైన
మాసిపోదు చితిలోనైనా " [7] అని మనసు సున్నితత్వాన్ని ఇంకా స్పష్టంగా చెప్పారు. అంతేకాదు..

"కునుకు పడితే మనసుకాస్త కుదుట పడతది
కుదుటపడ్డ మనసు తీపి కలలు కంటది " అని మనసుకూడా మనిషిలాగే ఎలా ప్రవర్తిల్లుతుందో చెప్పారు.

మనుషులు పోయినంత మాత్రాన వారికి సంబంధించినవన్నీ వారితోనేపోవు. వారిని తలపిస్తూ వారిని గుర్తుచేసే కొన్ని జ్ఞాపకాలు, అనుభూతులు, అనుభవాలు మన మనసుల్లో మెదులుతూ వుంటాయి. అందుకే –

'మణిషి పోతె మాత్రమేమి మనసు వుంటంది.
మనసుతోటి మనసెపుడో కలిసిపోతది ..." [8] అంటూ మనిషి అశాశ్వతత్వాన్ని, అలా వారుపోయినా బ్రతికున్నటువంటి వారి మనసులతో శాశ్వతంగా పెనవేసుకునే వారి మనసును గూర్చి చెప్పారు.

ఆత్రేయగారి దృష్టిలో లక్షలు కోట్లు గలవాళ్లు కాదు గొప్పోళ్లు. కలవాళ్ళు మరెవరంటే–

"మహారాజు కన్నా గొప్పవాళ్ళు
మనసూ మమత కలవాళ్ళు " [9] అని మంచిమనసూ, మంచి మమత కలవాళ్ళే అసలైన ఐశ్వర్యవంతులని అంటారు. అదేవిధముగా డబ్బు విసిరితే విలువకట్టి ఇచ్చేది కాదు బంగారము. అసలైనా బంగారము

" మమతున్న మనసే బంగారం " [10] అంటారు.

మనిషిని మనిషిగా నడిపించే, ప్రవర్తింపచేసే ఇంతవిలువైన మనసు మనిషికి లేకపోతే ఆ మనిషికి బ్రతుకొక నరకమనీ 'సెక్రటరీ' చిత్రంలో అంటారు. మనిషిలో మంచితనం, మనసులో మమత ఉండాలి. కాని ఈనాటి సమాజంలో ఇవి కలిగిన వారికి విలువలేకుండా పోతుందని వీటిని లేకుండా చేసుకుంటే బ్రతుకే చేదవుతుందనే విషయాన్ని –

" మంచితనానికి తావేలేదు. మనిషిగా మసలే వీలులేదు.
మనసుకు మమతకు విలువే లేదు.
ఏదీలేని బ్రతుకే చేదు " [11] అని చక్కగా చెప్పారు.

రెండు మనసులను కలిపేది ప్రేమ. మనిషిని మనిషిగా తెలిపేది, గుర్తింపచేసేది మనసు. ఈ రెండూ మనిషికి లేకపోతే మనిషి మనుగడ బీడవుతుందని " తల్లిదండ్రులు " చిత్రంలో అంటారు.

మనసు ఉండటం మనిషికి ఎంత విలువో, అవరసమో చెప్పిన ఆత్రేయ ఆ మనసు ఉండటమే పాపమని కూడా చెప్పారు. ఇది ఆత్రేయగారి విరుద్ధమైన భావనకాదు. ప్రతి మనిషిలో కలిగే ఆలోచనా విధానమే! మంచితనం వల్ల మోసపోయిన ప్రతివ్యక్తి మంచితనాన్ని పెంచే మనసు వుండటం దౌర్భాగ్యం అనుకుంటాడు. ఇది సహజం. ఈవిధమైన భావనలు కలిగిన పాత్రలకు రాయాల్సి వచ్చినప్పుడు ఆత్రేయ అలారాయడం జరిగింది.

"మనసు గతి యింతే – మనిషి బ్రతుకింతే

మనసున్న మనిషికీ – సుఖము లేదంతే… ” [12] అని మంచిమనసు వల్ల దెబ్బతిన్నవారి మనోభావనను చెప్పారు. 'మనిషికి మనసుండటమే పాపం' అని 'బంగారు బాబు' చిత్రంలో, మనసుండటమే మనిషికి శిక్ష – అని 'అదృష్టవంతులు' చిత్రంలో బుచ్చిబాబు, రఘు పాత్రల ద్వారా పలికిస్తాడు ఆత్రేయ. శిక్షలో కూడా కఠినమైన శిక్ష ఏమిటంటే మనసుండటమేనని "ప్రేమనగర్" చిత్రంలో చెప్పారు. కొన్ని విషయాలను మనసులో పెట్టుకోకూడదు. చేదు అనుభవాలను మనసు మనిషికి పదేపదే గుర్తుచేసి గాయపరుస్తుంది. అప్పుడు ఆమనిషికి నరకం – ఆ మనసే అంటారు 'సెక్రటరీ' చిత్రంలో..

ఆత్రేయ మనిషికి కనిపించని మనసుగూర్చి ఎన్నో విషయాలను చెప్పడమే కాక ఆ మనసు పొరల్లో దాగిన ప్రతి అంశాన్ని కూడా చెప్పారు. " మనసున పారే – సెలయేరు ప్రేమ' [13] అని ప్రేమంటే ఏమిటో చెప్పారు. అదేవిధముగా 'భావ'మంటే "మనసులోని మాట" [14] అని అంటారు. మనిషిలో పైపై నవ్వులు ఎందుకున్నాయంటే " మనసును దాచేటందుకు" [15] అని అనవ్వుల వెనకున్న అసలు రహస్యాన్ని చెప్పారు ఆత్రేయ.

ప్రేమ ఎప్పుడు పుడుతుంది. ఒకరి మనసు మరో మనసుపై ధ్యాసపెట్టినప్పుడు అంటే – కాదు, "మనసులు రెండు పేచీ పడితే వలపే పుడుతుంది' [16] అని అంటారు. ఇంకా చెప్పాలంటే..

"మనసుంటే ప్రేమతానే పుట్టుకొస్తుంది

వయసొస్తే వద్దన్నా నెట్టుకొస్తుంది" [17] అని అంటారు. అంటే ప్రేమ పుట్టడానికి, అనుబంధాన్ని ఏర్పరచుకోడానికి అసలు మనసులనేవి ఉండాలికదా! అందుకే " మనసుంటే ప్రేమ తానే పుట్టుకొస్తుంది ' అని రాశారు ఆత్రేయ. "ఇవ్వమంటే ఇచ్చేది మనసుకాదు" [18] అంటారు ఆత్రేయ. 'నేను నిన్ను' మనసారా ప్రేమిస్తున్నాను. కనుక నీవు నన్నూ ప్రేమించు. నాకు నీ మనసివ్వు' అని అర్థించేది కాదు ప్రేమ. అర్థించాడు కదా అని వెళ్ళేదికాదు మనసు. ప్రేమభావనలు మనసులో రేకెత్తాలి స్వతహాగా…

కోటీశ్వరుని చేసుకొని బ్రతుకును నరకం చేసుకున్నవాళ్ళున్నారు, పేదవాడ్ని చేసుకొని బ్రతుకును స్వర్గం చేసుకున్నవాళ్ళూ వున్నారు. ఆనందమైన జీవితాన్ని గడపడానికి మంచి మనసుగల వ్యక్తిని మనం జీవితభాగస్వామిగా చేసుకోవాలి. జీవిత భాగస్వామే కాదు. మనం స్నేహితులుగా ఎవరితోనైనా కొత్తగా పరిచయం ఏర్పరచుకునేటప్పుడు ఆమనిషి మనసు మన మనసుతో కలవగలిగిందా లేదా? అని తెలుసుకోవాలి. అందుకే మనసు ఇచ్చిన మనిషితోటి మనుగడే ఆనందమని చెప్పారు.

మనిషన్న తరువాత ఆ మనిషికి

"అల్లరి చేసే వయసుండాలి

ఆశలురేపే మనసుండాలి " [19] అని ఆత్రేయ అంటారు.

ప్రేమకు దాహమై పెరిగిననాడు మనసు పండుతుందని – అలాగే తీయని స్నేహమై తరగని నాడు అది మరుజన్మగా మారుతుందని మనసు పండి మరు జన్మగా ఎలా మారుతుందో చెప్పారు.

"మానవులనుభవించే సమస్త సుఖ దు:ఖాలకు వారి మనస్సే కారణం. ఆ మనస్సు తరతరాల అనుభవ జ్ఞాపకాల దొంతరలను తనలో భద్రంగా దాచుకుంటుంది. మనిషిని మహనీయులుగా మార్చగల మహత్తర శక్తి మనస్సుకుంది" అంటారు ఆత్రేయ. అంతేకాదు "అజ్ఞానం ఆవరించి వున్నంత వరకూ మనసు అడ్డదారులు తొక్కుతునే వుంటుంది. 'జ్ఞానం' అనే వెలుగు ప్రసరించగానే అది మారుతుంది. సన్మార్గాన్ని తెరుచుకుంటుంది" [20] అని అంటారు ఆత్రేయ. మనకు దూరంగా వున్నా మనవారిని గూర్చి బాధపడకూడదు. ఎందుకంటే " మనుషులు దూరమైనప్పుడే మనసులు దగ్గరవుతాయి" [21] అని ఆత్రేయ అంటారు . మనకు సహాయం చేసినవారికి కృతజ్ఞతలు చెప్తూ ఉంటాం. కాని ఆత్రేయ అలా చెప్పవద్దంటాడు. ఎందుకంటే కృతజ్ఞత చెప్పుకుంటే తీరిపోతుంది. మనసులోనే దాచుకుంటే మనసుల్ని ఇంకా దగ్గర చేస్తుందని " మధురస్వప్నం " చిత్రంలో ఆత్రేయ అంటారు .

ఆత్రేయ మనసును ఇంకా సూక్ష్మదృష్టితో పరిశీలించి–

వయసు పెరిగినా మనిషి ఎదిగినా

మనసు ముదరనంతవరకు

మాసిపోదు పసితనం " [22] అని అంటారు. ఫలానా మనిషి ఎలాంటివాడని తెలుసుకోవాలంటే...

"మనషిని మనసుతో కొలవాలి

మనసును మమతతో తూచాలి" [23] అని సలహా ఇస్తారు ఆత్రేయ.

ఆత్రేయ మనిషికి కనిపించని మనసు గురించి, ఆ మనసు పొరల్లో దాగిన మర్మాన్ని తెలుసుకొని చెప్పడమే కాదు.

"మౌనమే నీభాష ఓ మూగమనసా

తలపులు ఎన్నెన్నో కలలుగంటావు

కల్లలు కాగానే కన్నీరౌతావు

ఒక పొరబాటుకు

యుగములు పొగిలేవు " [24] అని ఆ మనసు మనస్తత్వాన్ని కూడా ఎంతో గొప్పగా చెప్పారు ఆత్రేయ.

ఆత్రేయ తన పాటలు మాటలలో మనసును చీకటి గుహగా, చింతల చెలిగా, నాటకరంగానిగా, తెగిన గాలి పటానిగా, కూరిమి వలగా, ఊహల ఊయలగా, మాయల దయ్యానిగా, అమృత కూజాగా, మధుకలశంగా, నిండుకుండగా, పాలకుండగా, గాజుబొమ్మగా, దేవాలయంగా, పసిపాపగా, నునుపైన చిగురాకుగా, మల్లెగా, మందారంగా పోల్చడమే కాదు వయసు కోతివంటిదైతే మనసు కొమ్మవంటిదని వివిధ రకాలుగా అభివర్ణించారు.

మనసు గురించి ఇన్ని కోణాలలో ఇన్ని రకాలుగా పరిశీలించి ఎన్నో గొప్ప విషయాలను చెప్పిన ఆత్రేయ మనసు అర్థం చేసుకోవడం ఎంతో కష్టమని తనను తాను తగ్గించుకుంటూ...

" చూపులతో లెక్కగట్టి – వయసెంతో చెప్పగలను

మనసులోతు చెప్పజాలనీ

మనిషి నేనమ్మ " [25] అని అంటారు.

భౌతికమైన ఈ శరీరానికి మరణం ఉన్నా " మనసుకు మమతకు మరణం లేదని" [26]అంటారు. అందుకే

"మనసుకు చావు – లేకున్నది

మనషికి ఎపుడో – రానున్నది" [27] అని చెప్తూ...

"మణిషి పోతెమాత్రమేమి మనసు వుంటదీ

మనసుతోటి మనసెపుడో కలసి పోతదీ"[28.] అని ఆ మనసు అమరత్వాన్ని తెలిపారు మనసుకవి... మన–సు–కవి అచార్య ఆత్రేయ.

# పాదసూచికలు

1.రాజూ–పేద: యువరాజువలె..

2.బాబు:ఓ జంటకలిసిన...

3.అంతేకావాలి: ఓ వెడలిపోయే...

4.మరో చరిత్ర: ఏ తీగ పువ్వునో...

5.మూగ మనసులు: ముద్దబంతి పువ్వులో...

6.ప్రేమనగర్: మనసుగతి యింతే...

7.ఆడబ్రతుకు

8.మూగ మనసులు: పాడుతా తీయగా...

9.అల్లరి బుల్లోడు:పేదలకన్నా పేదవాళ్లు

10.కొడుకు–కోడలు: నీకేం తెలుసు నిమ్మకాయ..

11.బంగారు కలలు

12.ప్రేమనగర్

13.ప్రేమ: ఇవ్వు ఇవ్వు ఒక్క ముద్దు...

14.చక్రవాకం: వీణలోన తీగ...

15.ప్రేమనగర్: నేను పుట్టాను ఈ లోకం

16.దేశోద్ధారకులు

17.భలే అల్లుడు

18.ఆత్మబలం:ఎక్కడికి పోతావు..

19.తాసిల్దారుగారి అమ్మాయి.

20.అయ్యప్పస్వామి మహత్యం

21.తోడి కోడళ్ళు

22.ప్రాణమిత్రులు

23.గాజుల కృష్ణయ్య: వద్దురా వద్దురా..

24.గుప్పెడు మనసు

25.బాబు: అయ్యా బాబోయ్...

26.వనజా: గిరిజా నీ కన్నులలో

27.ప్రేమ

28.మూగమనసులు: పాడుతా తియగా...

# ఆత్రేయ విమర్శనాత్మక గీతాలు

ఆచార్య ఆత్రేయ కవిగాగాక  ఒక మనిషిగా, మంచిమనిషిగా  రకరకాల మనషులను, వారి స్వార్ధపూరితమైన మనస్తత్వాలను, భారతదేశ దారిద్ర్యస్థితిని, మోసపూరితమైన రాజకీయ వ్యవస్థను, దేశద్రోహులను బ్లాక్ మార్కెట్ చేసే పెద్దమనుషులను కళ్లనెత్తికెక్కి మనుషులను మనుషులుగా చూడని వారిని మనుషులు చేత గొప్పవ్యక్తులుగా చారిత్రక పురుషులుగా కీర్తింపబడేవారిని, ఈలోకం పోకడాలను ఒక్కోచోట సున్నితంగానూ, అవసరమైనచోట తీవ్రంగాను నిశితంగా తన పాటల్లో విమర్శించారు.

ఆత్రేయగారిలో వున్న గొప్ప లక్షణం ఏమిటంటే మనసులోని మాటను ఎదుటివారి మెప్పుకోసం మార్చిచెప్పాక ముక్కుసూటిగా చెప్పడం ! అది విమర్శ కావచ్చు... సదభిప్రాయం కావచ్చు... దురభిప్రాయం కావచ్చు. ఈ విమర్శలల్లో మనం గుర్తించాల్సింది ఆత్రేయ వేదన,నిస్సహాయత,నిట్టూర్పు సామాన్య ప్రజలు ఏళ్లు తరబడి  ఇలానే పేదరికంలోనే ఉంటున్నారేమిటి ? లక్షాధికారి కోటీశ్వరునిగా ఎదగడం ఏమిటి? కుళ్లు రాజకీయాలతో భారతదేశం దారిద్ర్య స్థితినుండి తప్పించుకొనలేదా? నిరుద్యోగపు కోరల్లో విద్యావంతులు బలికావాల్సిందేనా? వేరే మార్గంలేదా? ఇలా ఎన్నో వాటిని గురించి, ఆలోచించి ఆవేదన చెందే రచయిత ఆచార్య ఆత్రేయ. కవిగా ఆలోచనల వరకే పరిమితం కాక మనిషిగా వారు చేయదగినంత ఆర్థిక, ఆర్థికేతర సహాయాలు చేసారు.

మొదటిగా మనుష్యులను ఆత్రేయ ఏవిధంగా విమర్శించారో పరిశీలిద్దాం. మొట్టమొదట మనిషి అనాగరిక వున్నప్పుడు మోటుమనిషిగా వున్నాడు. ఇప్పుడు అలాగే వున్నాడు. అప్పుడు ఆకారంలో, చేసే పనులలో ఇప్పుడు ఆలోచనలలో మనిషి ఇంకా అనాగరికంగా బ్రతుకుతున్నాడు. కనుకనే ఈ పోలీస్ స్టేషన్లు, కోర్టులు, మరణశిక్షలు లేకపోతే ఏమిటి? ఒకమనిషిని మరో మనిషి విచారించి శిక్షిస్తే ఇంకో మనిషి ఉరితీయడం. విచక్షణాజ్ఞానం కలిగిన మనిషి కూడా క్రూర జంతువు కంటే భయంకరమైన స్వభావాన్ని కలిగి ఇన్ని అరాచకాలను సృష్టిస్తున్నాడు. ఇవన్నీ మనిషి మనసులో నిబిడీకృతంగా వున్న లక్షణాలు. అందుకే ఇంత భయంకరమైన మనిషి స్వభావాన్ని గుర్తించిన ఆత్రేయ..

" నాగు కరిస్తే నరులు బ్రతకడం
వందకు పదిమందైనా సహజం
నరుడు కరిస్తే నల్లత్రాచుకే
నాలుగు క్షణాల్లో మరణం ఖాయం " అని అంటారు. అవును! ఒకడు మనసుతో తియ్యగా మాట్లాడతాడు. ఆ వెనుక మన ప్రాణాలు తీయడానికి పన్నాగం పన్నుతుంటాడు. పైకి నవ్వుతూ కనబడుతుంటాడు. మనకు తెలియదు... ఆ నవ్వు వెనుక ఎంతటి ఘోర తలంపులు వున్నాయో ! ఇది మనిషి స్వభావం. మనకు కనిపించకుండా మన శరీరంలో ప్రవాహించే విషపదార్థం కోరికలట. ఈ కోరికలు మనిషిలో ఎంత బలీయమైనవంటే...

"(నాగు పాముకి) రాలగొట్టితే కోరలు పోతాయ్
నరుడూ కాలిపోయిన కోరికలుంటాయ్"[1] అని ఆత్రేయగారు అంటారు.

అసలు మనషులకన్నా మృగాలే నయం. ఎందుకంటే మానవునిలా వాటికి అతి తెలివి లేదు. అందుకే ఆత్రేయ "తోటరాముడు" చిత్రంలో జంతువును మానవజన్మని కోరవద్దని ఇలా ప్రాధేయపడతాడు.

"తీపి మాటలు గొంతు కోతలు
నరులకు మాకే సొంతం" అని రెండు నాలుకలతో మాట్లాడే మనిషి మాటల్లోనే భయకర పన్నాగాన్ని బట్టబయలు చేసారు. ఇంకా చెపుతూ –

" గడ్డిని నువ్వు మేసి, పాలను మాకిస్తే..

కడుపుబ్బ తాగేమురా.. మేము

గరళాన్ని కక్కేమురా

కాళ్ళుపట్టడం, కాటువేయడం నరులకు మాకే సొంతము" అని మనిషి స్వభావాన్ని చెప్పారు ఆత్రేయ.

" మనిషి చాలా దొడ్డాడమ్మా చెల్లెమ్మా

తెలివి మీరి చెడ్డాడమ్మా చిన్నమ్మా "[2] అని తెలివిమీరి చెడిన మానవజాతి గురించి చెప్పారు ఆత్రేయ.

"బ్రతికుండగా నిన్ను ఏడిపించినోళ్లు,

నువ్వు చస్తే ఏడుత్తారు దొంగనాయాళ్లు "[3] అని కొంతమంది మనుషుల మనస్తత్వాన్ని విమర్శించాడు. అంతేకాదు

"తలచింది జరిగిందంటే నీ తెలివంటావు

బెడిసిందా తలరాతంటూ విధిపై నెడతావు "[4] అని మనల్ని విమర్శిస్తారు. ఇంకా ఎలాంటోళ్లంటే...

"అన్నం లేకొకడేడుస్తుంటే

డిన్నరు చేస్తాడింకొకడు" అంటూ సాటి మనిషి ఆకలి బాధనెరకగ తన పొట్టను నింపుకునే వాడిని విమర్శిస్తాడు.

అదేవిధముగా " పీలిక లేకొక పేదపడుంటే

జల్సాగా చీరలు కడుతుందొకతె !" అని సాటి స్త్రీ పేదరికంలో మగ్గిపోయే స్త్రీని ఆదుకోక జల్సా చేయడాన్ని 'ఆదర్శం' చిత్రంలో విమర్శిస్తాడు. ఇలా మనుషుల మనస్తత్వాలను విమర్శించారు.

పొట్టకూటికోసం అడుక్కుతినే ఆడదాన్ని కనకరించని ఈలోకం అదే ఆడదాని కాళ్ళదగ్గర పడేటంత నీచమైంది. ఏవిధంగంటే –

" కడుపు మాడిపోతుంటే

కనికరించరు – కాస్త కవళమెయ్యరు

కడుపంతా బైటపెట్టి బొడ్డుకింద చీరకట్టి

నడుమూపినానంటే

పడిచచ్చిపోతారు నాయాళ్లు"[5] అని విమర్శిస్తారు ఆత్రేయ.

ఆకలితో అలమటించి పోయే వారిని చూసి మనసు చలించిన వ్యక్తి ఆత్రేయ. ఇలాంటి పేదవారికి తిండిపెట్టి ఆదుకొనక మూఢభక్తితో నోరుండి తినలేని దేవతా ప్రతిమలకు పళ్లూ ఫలహారాలు, నైవేద్యం అర్పిస్తూ... ఆకలితో అలమటించే వారిని తరలికొట్టే మూఢులను ఉద్దేశించి..

" తినని దేవుడికి తిండిపెట్టి తినమంటావు ఒరే ఒరే

తిండి లేక ఎండేవారిని తిట్టి తరుముతావు "[6] అని వారిపై ధ్వజమెత్తుతాడు.

సాంఘిక అసమానతలకు కారకులు, బాధ్యులు ఈ మానవులేనని ఆత్రేయ అంటారు . అందుకే –

"నేలా, నీరు, గాలి, వెలుగు దేవుడు సృష్టించాడు

నాదీ నీదను స్వార్థం శాస్త్రం మనిషే కల్పించాడు"[7]అని అంటారు.

అసమానతలున్న ఈ సమాజంలో సమానత అనేది స్మశానంలోనైనా ఉంటుందని భ్రమించే వారినుద్దేశించి –

" కాటికెళ్ళితే అందరూ ఒకటే అనుకోబోకు

అక్కడ కూడా తేడాలున్నాయి కాలేవరకు " అని ఈ మానవ సమాజంలోని సామాజిక అసమానతల భయంకర స్వరూపాన్ని చూపారు.

ఇంకా ఈ మనుషులు ఎలాంటోళ్ళంటే... ఉన్నవాళ్ళను నెత్తినెక్కించుకుని వారి తప్పులను ఒప్పులుగా అంగీకరించేవారు ఎలాగంటే –

" పని దొరకని పేదవాణ్ణి సోమరిపోతంటారు

పని చెయ్యని గొప్పవాణ్ణి పల్లకిలో మోస్తారు " [8] అని విమర్శిస్తారు ఆత్రేయ. డబ్బున్నదికదా.. ఏదిచేసినా చెల్లుతుందనుకునే వారిని ఉద్దేశించి –

" పెద్ద మనిషి చేస్తే అది రంగేళి శృంగారం

పేదవాడు చేస్తే అది రంగేళి వ్యభిచారం " [9]అని విమర్శిస్తారు. శ్రమదోపిడితో,అక్రమ సంపాదనతో కారులో విలాసవంతంగా తిరుగుతూ ఉండే పాలబుగ్గల పసిడిదాన్ని ఆత్రేయ ఏమని ప్రశ్నించారంటే..

" కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడిదాన

బుగ్గమీద గులాబిరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా " అని ప్రశ్నించి దానికి ఎత్తుగడగా

" నిన్ను మించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే

వారి బుగ్గల నిగ్గునీకు వచ్చిచేరెను తెలుసుకో " అని తానే సమాధానం చెప్తాడు. అదేవిధంగా చాలువరాతిమేడలో కులికేవారికి ఆ చలువరాయి ఎలా వచ్చిందో తెలియదు. తెలియక పోవడమే కాదు తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా చేయరు. అందుకే –

" కడుపుకాలే కష్టజీవులు ఒడలు విరిచీ గనులుతొలచి

చెమట చలువను చేర్చి, రాళ్లను తీర్చినారు తెలుసుకో " అని చెప్పారు. అలాగే అతిచక్కని, ఖరీదైన చీరను కట్టానని సింగారించుకుని తిరుగుతారేకాని దాన్ని నేసిన వారి స్థితిగతిని గూర్చి ఆలోచించరు. ఇలా శ్రమదోపిడితో డబ్బును సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారినుద్దేశించి –

" చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో" అంటూ హెచ్చరిస్తారు 'తోడికోడళ్లు' చిత్రంలో.

అలాగే డబ్బున్నదనే అహంతో కన్నుమిన్ను కానకుండా కారునడిపే వారిని ఉద్దేశించి

"రోడ్డెంత బాగుంటే మీకంత హుషారు

దాన్నేసినోళ్ళ మీదనే – ఎక్కించి పోతారు

మేమెక్కి కూచుంటే – మీరేమై పోతారు "అని ఆలోచించమంటాడు 'మైనరుబాబు' చిత్రంలో.

అసలు పేదవర్గం కష్టంపైనే ధనికవర్గం ఆధారపడి బ్రతుకుతున్నారని అంటాడు ఆత్రేయగారు. ధనికవర్గానికి వారు పుట్టిననాటినుంచి చివరికి చచ్చి కాలి బూడిదయ్యేవరకు పేదవాడి అవసరం ఎంతైనా వుందని –

" నీకు గొయ్యైనా కట్టెలైనా పేర్చేది పేదోడు " అని " కక్ష' చిత్రంలో చెప్తారు ఆత్రేయ.

కొంతమంది పెద్దమనిషిననే ముసుగులో ఎన్నో తప్పులు చేస్తుంటారు. అలాంటి వారిని ఉద్దేశించి –

" రోజంతా పెద్దమనిషీ, రాత్రయితే ముసుగేసి

నక్కినక్కి పోయేను "[10] అని విమర్శిస్తారు.

ఇక బ్లాక్ మార్కెట్ చేసే వారిని ఆత్రేయ ఏమని విమర్శించారో చూద్దాం !

" మనుషులు కొందరు చూస్తూ వున్నా

చూస్తూ మందులు దాస్తాడొకడు "[11] అంటూ బ్లాక్ మార్కెట్ చేసి వారిని విమర్శిస్తారు ఆత్రేయ. అంతేకాదు –

"దేశం అంటాము తిండిని దాస్తము

కల్తీలు చేస్తాంమురా

ప్రాణాలు తీస్తాంమురా"[12] అని జంతువుకి మనిషి చేసే బ్లాక్ మార్కెట్ గూర్చి చెప్తూ విమర్శిస్తారు ఆత్రేయ.

డబ్బుకోసమే సరుకులు దాస్తారు నల్లబజారు వర్తకులు. ఆ డబ్బే విసిరితే " దొంగబజారున దొరకందేమిట?" అని ఆత్రేయగారు అంటారు. ఇలాంటి నల్లబజారు గూర్చి పేదలలో వున్న అభిప్రాయం ఏమిటంటే..

"దొంగబజారు, దోపిడిబజారు – బీదల ఎదలో బేజారు

ధనికుల చేతిలో కైజారు " అని అంటారు ఆత్రేయ గారు' ఆదర్శం చిత్రంలో.

విదేశాలకు వెళ్ళే వారిని ఉద్దేశించి

" దేశమొదిలి దేశమూ దిక్కు మొక్కు లేకుండా

తెలుగోళ్లు వలస పోయేదెందుకు "[13] అని విమర్శిస్తారు.

" దేశాన్నిదోచేటి ఆసాములున్నారు" అని దేశాన్ని దోచుకునే దేశద్రోహులను కూడా విమర్శించారు ఆత్రేయ.

బంగారు భారతదేశాన్ని పేద దేశంగా చిత్రించి వారి స్వార్ధ రాజకీయంలో భాగంగా విదేశాలముందు చేయిచాచి యాచించే రాజకీయ నాయకులను ఉద్దేశించి –

"పసిడితల్లి మన భారత మాతను పేదరాలుగా చూస్తారా

పరదేశాల్లో తలవంచే పరిస్థితిని కలిగిస్తారా " అని నిశితంగా విమర్శిస్తారు ఆత్రేయ.

ఇలాంటి దుష్టరాజకీయ నాయకులున్నంతకాలం సగటు మానవుని పరిస్థితి అదోగతే ! అందుకే –

" రాజు లెందరు మారినా

మన రోజులేమో మారవు "[14] అని మెరుగుపడని ప్రజల జీవన స్థితిగతుల గూర్చి చెప్పారు.

ఈ నాటి రాజకీయ విధానాన్నే కాదు

" రోజుకొక్క కొత్తపార్టీ లేవదీస్తాడు –

ఎం.ఎల్.ఏ., ఎం.పి. అవుతాడు "[15] అని సిద్దాంతాలు లేని రాజకీయ నాయకుల పుట్టుకను కూడా విమర్శించారు. ఇంకా రాజకీయ నాయకులు ఎలాంటి వారంటే –

" ప్రతిఒక్కడూ తినమరిగిన వాడూ.. ప్రజల

పేరు చెబుతుంటాడు నిలదీసి నీ ప్రజలెవరంటే –

నిన్నూ కాస్త తినమంటాడు.

దొంగలుదొంగలు ఊళ్ళు పంచుకొని దోరలైపోతుంటే

అసలు పార్టీ నాదీ నాదని వాళ్ళల్లరి పడుతుంటారని"[16] విమర్శిస్తారు ఆత్రేయ.

మనదేశంలో ఆర్థిక వనరులు ఎన్నో వున్నా ఆర్థిక పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. అందుకే –

"మనతల్లి అన్నపూర్ణ మన అన్న దానకర్ణ

మన భూమి వేదభూమిరా తమ్ముడూ

మనకీర్తి మంచుకొండరా

డిగ్రీలు పుచ్చుకొని చిప్పచేత పుచ్చుకొని

ఢిల్లీకి చేరినాము దేహి దేహి అంటున్నాము.

దేశాన్ని పాలించే భావి పౌరులం బ్రదర్

చదువెయ్య సీటులేదు చదువొస్తే పనీలేదు

అన్నమో రామచంద్ర అంటే దిక్కేలేదు "[17]

అంటూ వనరుల పరంగా సంపన్న దేశమైన ఈ దేశంలో విలయతాండవం చేసే నిరుద్యోగిత, ఆహార సమస్యలను ఎత్తి చూపుతూ భారతదేశ రాజకీయ వ్యవస్థను, ఆర్థికవిధానాలను వ్యంగ్యంగా విమర్శించారు ఆత్రేయ. ఇలాంటి స్థితినుంచి మనదేశాన్ని మంచిస్థితికి తీసుకెళ్లేలా రాజకీయ నాయకులు ప్రయత్నించాలేకాని ఐదేళ్లకొకసారి ఓట్లకోసం ఊకదంపుడు మాటలతో ఉపన్యాసాలొలకొద్దంటూ..

" ఇస్తే – చాలదు సందేశం – ఇవ్వాలయ్య సౌకర్యం "[18] అంటూ సున్నితంగా విమర్శిస్తారు.

ఐదేళ్ళకొకసారి చేతులు జోడించి ఓట్లుకోసం మనకు తియ్యని కబుర్లు చెప్పి మాయ చేయదానికి నవ్వుతూ మన

ముందు ప్రత్యక్షమవుతారు రాజకీయ నాయకులు.

" నవ్వు నవ్వుకు తేడా ఉంటుంది" అని చెప్పిన ఆత్రేయగారు రాజకీయ నాయకులు నవ్వేనవ్వులు ఎలాంటివో 'ముద్దులమొగుడు' చిత్రంలో ఇలా చెప్పారు.

" అయిదేళ్ళకొకసారి జనానికి చేతులు జోడ్చి నవ్వేనవ్వు ఎలక్షన్ నవ్వు, గద్దెఎక్కిన మరుక్షణాన్నే అదే జనాన్ని చూసి చూడకు నవ్వేనవ్వు అధికారం నవ్వు "

ఆత్రేయగారు మనల్ని కోరేది ఒక్కటే ! అది ఏమిటంటే ప్రతి ఒక్కరూ రాజకీయ స్పృహను కలిగి ఉండమని. ఓటు వేసేముందు మనం ఎన్నుకోబోయే వాడు ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చే నాయకుడా!... మూటలు కట్టుకొని ఇంటికి చేర్చుకునే రాజకీయ నాయకుడా అని ఆలోచించి ఓటు వేసి అధికారం అప్పజెప్పాలి. అలాగే కులమతాలను అనుసరించి రాజకీయాధికారాన్ని కట్టబెట్టవద్దంటారు. నాయకుల మాటలను నమ్మి విధ్వంసాలను సృష్టించొద్దంటారు. జాతిపిత గాంధీ అంటూ ఆయన ఆలోచనలకు వ్యతిరేకంగా పనులు చేసే వారిని కూడా వ్యంగ్యంగా చురకలు వేస్తూ ఆత్రేయ ఇలా విమర్శించారు.

" మామూలు మనుషులను మంత్రులను చేశాము
అవినీతి లంచాలు మామూళ్లు చేశాము
మతవిభేదాలను మసి చేయగా నెంచి
కొంపలంటించాము, మంటలే రేపాము
నిరసన వ్రతములు నిత్యమూ చేశాము
నీ పేరు చెబుతూనే ఇన్నీ చేస్తున్నాము "[19]

సరైన కారణాలు లేకుండా స్ట్రైక్ చేసే కార్మికులను, కార్మిక నాయకులను కూడా సున్నితంగా విమర్శించారు ఆత్రేయగారు. ఏవిధంగానంటే..

"బోనసు కోసం పోరాడాలని
సంఘం పెడతావ్ ఛాతీ తడుతావ్
బాగుంది కాని
పరిశ్రమించి భారతదేశం
భాగ్యం పెంచారనుకోలేం "[20] అని అంటారు.

ముందు మన బాధ్యతలు మనం సక్రమంగా నిర్వహించి హక్కులకోసం, పొందవలసిన వాటి గూర్చి పోరాడాలగాని... అర్థం పర్థం లేకుండా దేశ ఆర్థికాభివృద్ధికి అడ్డుకాకూడదంటారు. అందుకే –

" హక్కులకోరే చక్కన్నా
నీ బాధ్యత లెరుగు బయ్యన్నా "[21] అంటారు ఆత్రేయ.

ఆత్రేయ తన విమర్శలో లోకాన్ని కూడా వదలిపెట్టలేదు. స్వార్ధపూరితమైంది ఈలోకం. కాకిలా కూస్తుంది. అందుకే ఆత్రేయ.

" ఏమిలోకం ! ఏమిస్వార్థం
ఎక్కడున్నది మానవత్వం "[22] అంటూ విమర్శిస్తారు. కాబట్టి

"కాకిని కోకిల చేస్తావో – లోకంలో ఒకడై పోతావో" అని మనలనే తేల్చుకోమని లోకాన్ని సున్నితంగా విమర్శించారు.

ఈలోకం మనిషికి విలువనివ్వదు. మనిషి సృష్టించిన ధనానికి విలువనిస్తుంది. కాని ఆత్రేయ ధనానికి ఎప్పుడు ప్రాముఖ్యతనివ్వలేదు. ఈ విషయాన్నే వారి డైరీలో ఈవిధంగా రాసుకున్నారు.

" నేను ధనం గొప్పతనం ఒప్పుకోను

నా తుది ఊపిరిదాకా

మనిషిని, మనసునే నమ్ముతాను

మనసులేని ధనం

మట్టికి సరికాదు అంతే ! "[23]

ఇలా అనడమే కాదు, ఆచరణలో చూపించారు చివరి వరకు. ఎందరికో ఉదారంగా ఆర్థిక సహాయాన్ని చేశారు.

"ధనం చేత సుగుణం రాదు, కాని

సుగుణం వల్ల ధనంతో పాటు

అన్నీ సమకూరుతాయి"[24] అంటారు ఆత్రేయగారు. అలాగే –

" విద్య కంటే ధనం లేదు

అపకీర్తికంటే మరణం లేదు"[25] అని ధనం పట్ల వారి అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఇప్పుడు  డబ్బేరాజ్యమేలుతుంది. ఈ రోజుల్లో ప్రతిదీ డబ్బుతోనే చూస్తున్నారు ప్రజలు. అందుకే ఆత్రేయ.

" దేశం పోయే తీరులో

తిన్నగా ఏది లేదు రోయ్

పాపం పున్నెం మాటలో

పైసా ఒకటే రాజురోయ్

పగటేసమేసే కాలమురో ఇది

పలు కాకిమూక లోకములో

పెపంచమంతా పైసా లీలా

అదిలేని మనిసేమి మనిసిరో""[26] అని డబ్బుకు విలువిచ్చే వారికి విమర్శిస్తారు.

మనిషిచేత సృష్టింపబడిన డబ్బు – ఇప్పుడు నీతిమార్గాన్నే అవినీతిగా తీర్చిదిద్దింది. అందుకే –

"నిజం నలిగిపోతుంది ధనం చేతిలో

నీతి మూల్గుతున్నది వల్లకాటిలో""[27] అని డబ్బుద్వారా చేసే అవినీత పనులను విమర్శించారు.

ధనం ఉన్నవాడికి లేనివాడు ఈలోకం ఇచ్చే గుర్తింపును, ఈలోకం దృష్టిలో ధనానికున్న ప్రాముఖ్యతను ఆత్రేయ ఈవిధంగా విమర్శించారు.

" ధనంలోనె జగం ఉన్నది నిజం నిజం

ధనం ముందు గుణం చిన్నది నిజం నిజం

కలవాడే మొనగాడీకాలంలో – ధనం

లేనివాడు అందరికీ కాని వాడు ధరలో " అని విమర్శిస్తూ..

"ఉన్న నాడే అందరు మనకు ఆప్తులు "[28] అనే లోకం వైఖరిని నిరశించారు.

" డబ్బొక్కటే దైవము – డబ్బొక్కటే లోకము " సత్యమూ అని భావించే వారినుద్దేశించి..

" డబ్బన్నదే జబ్బురా – మందన్నదే లేదురా"[29] అని ధన ఆశ అనే జబ్బు ఎంత భయంకరమైనదో తెలుపుతూ – ఆ భావనతో ఉన్నవారిని విమర్శిస్తూ అలా అంటారు. కరెన్సీని కనుక్కొనక ముందు భూమి సూర్యుని చుట్టూ తిరిగేది. కరెన్సీ విధానం ఏర్పడిన తరువాత ప్రజలలో ఆ డబ్బుకు విలువ పెరిగినతరువాత ఈ డబ్బు చుట్టూ మనుష్యులు తిరగటం మొదలు పెట్టారు. అందుకే ఇలాంటోళ్లను గూర్చి...

" డబ్బేవరికి చేదు మంచోడా

ఈ భూమి తిరిగేది రూపాయిచుట్టూ

ఈ మనిషి కోరేది రూపాయి చెట్టు

డబ్బొక్కటే దైవము డబ్బొక్కటే లోకము "[30] అని విమర్శించారు.

కష్టపడకుండా డబ్బుబాగా సంపాదించాలనే ఆశకి సరిఅయిన మార్గంగా జూదాన్ని కొందరు ఎన్నుకుంటారు. ఇలాంటి వారిని చూసి

" లక్షలున్నవాడి మొదలు బిచ్చమెత్తువారివరకు

గుఱ్ఱాలపై కాచికాచి గాడిదలౌతారు కడకు "[31] అని చివాట్లు పెడతారు. లాటరీ టికెట్లు పేకాట.. ఇవన్నీ దురాశతో డబ్బు సంపాదించాలనుకునే వారి జీవితాలకి ఊబిలాంటివే !

ఈవిధంగా మనుషులు డబ్బుకిచ్చే ప్రాధాన్యతను ఆత్రేయ నిశితంగా విమర్శించారు.

మానవులచేత దేవుళ్ళగా పూజింపబడే రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, గంగా, సత్యభామలను, అలాగే చారిత్రక పురుషులుగా కీర్తింపబడే ధర్మరాజు, సత్యహరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, దేవదాసు, నాయకురాలు నాగమ్మ, ద్రౌపతి, దేవదాసు ప్రేయసి పార్వతీలను కూడా విమర్శించారు.

" ఎవరో వేసిన నిందను నమ్మి ఇంగితమే విడనాడి

ఎరిగి ఎరిగి చూలాలిని అడవికి తరిమివేసినాడు

వరించి పరిణయమాడిన సతిని

తనతో అడవికి తరలిన కాంతను

అగ్నిపరీక్షకు ఆగిన తల్లిని

విచారింపక విశదము తెలియక

విడనాడినవాడు పాశము తెగదెంచినవాడు "[32] అని శ్రీరాముడ్ని విమర్శిస్తారు. ఆత్రేయ అదేవిధముగా 'తేనె మనసులు' చిత్రంలో కూడా ఏమని విమర్శించారంటే –

" రాముడుకాదమ్మ నిందలు నమ్మడు

కృష్ణుడుకాదమ్మ సవతులు వుండరు

నువు పూజించే దేవుళ్ళ లోపాలు లేనివాడు... "[33] అని సున్నితంగా రాముణ్ణి కాక కృష్ణుడ్ని కూడా విమర్శించారు ఆత్రేయ.

ఇక బుద్ధుని ఏవిధంగా విమర్శించారో చూద్దాం !

" మనసునిచ్చిన మగువ మమతకన్నీరుగా

పారించి అడవులకు పారిపోయాడు"[34] అని విమర్శించారు. ప్రజలను దు:ఖం నుంచి కాపాడడానికి కట్టుకున్న భార్యను దు:ఖసాగరంలో ముంచిపోవాల్సిన పనిలేదని ఆత్రేయగారి భావన. ఈవిధంగా దేవుళ్ళగా పూజింపబడే వారిని విమర్శించడమే గాక పురాణ పురుషులను ఎలా విమర్శించారో కూడా చూద్దాం !

" జూదమాడి ఒకరాజు ఆలినోడినాడు

సత్యం, సత్యమని ఒక మగడు సతిని అమ్మినాడు "[35]

అని ధర్మరాజు, సత్యహరిశ్చంద్రులను కూడా ఆత్రేయ విమర్శిస్తారు.

'తాయారమ్మ – బంగారమ్మ ' చిత్రంలో ఆడ మగవారు పరస్పరం విమర్శించుకునే సన్నివేశానికి రాసిన పాటలో దేవుళ్లను, చారిత్రక పురుషులను ఆత్రేయ ఏవిధంగా విమర్శించారోకూడా చూద్దాం.

"ఒకడమ్ముకుపోయాడు

ఒకడడవికి పంపాడు

ఒకడేమో జూదంలో పందెం కాశాడు

తల్లిని చేసి ఒకడేమో తపస్వి అయ్యాడు

తండ్రికి భయపడి ఒకడేమో చచ్చినాడు " ఏ మగవాడూ, ఏ మగువను మనసున్నదిగా చూశాడని వరుసగా సత్యహరిశ్చంద్రుడు, రాముడూ, ధర్మరాజు, విశ్వామిత్రుడు, దేవదాసులను విమర్శించారు ఆత్రేయ. అదేవిధముగా

" నెత్తిన కూర్చుందొకతె – నెత్తిన తన్నిందొకతె

ఒకతేమో శపథం చేసి యుద్ధం తెచ్చింది

నాయకురాలై ఒకతేమో నెత్తురు పారించింది

తండ్రికి భయపడి ఒకతేమో ధనాన్ని పెళ్లాడిందీ ". ఏ మగువైనా మగవాణ్ణి మనిషిగా చూసిందా అని వరుసగా గంగా, సత్యభామ, ద్రౌపతి, నాయకురాలు నాగమ్మ, దేవదాసు ప్రేయసి పార్వతీలను విమర్శిస్తారు.

ఈవిధంగా ఆత్రేయ తన విమర్శనాత్మక గీతాలలో మనిషిని, మనిషి స్వభావాన్ని డబ్బే సర్వస్వం అనుకునే మనుషులను, సాంఘిక అసమానతలను, ఈ అసమానతలకు కారకులైన ధనికులను, రాజకీయ నాయకుల్ని, దేశద్రోహులను, దేవుళ్ళను, పురాణ పురుషులను ఇలా ఎందరినో నిశితంగా విమర్శించారు ఆత్రేయగారు. వారి విమర్శ హేతుబద్ధంగా ఉంటుంది. ఆత్రేయ విమర్శనాత్మక గీతాలలో సమాజ మార్పును ఆశించే విమర్శ వుంటుంది.

# పాదసూచికలు

1.దొంగలున్నారు జాగ్రత్త: వినరా నాన్న..
2.తొలికోడి కూసింది: అందమైన లోకమని...
3.మాయదారి మల్లిగాడు: నవ్వుతూ బ్రతకాలిరా తమ్ముడూ...
4.తాసిల్దారుగారి అమ్మాయి: కనబడని చెయ్యేదో...
5.ఎంకి–నాయుడు బావ
6.ఆలు మగలు: వినరా వినరా...
7.మనుషులంతా ఒక్కటే: కాలం కాదు
8.సత్యానికి సంకెళ్ళు
9.సత్యానికి సంకెళ్ళు
10.ఆలు మగలు: చీకటిరా బాబూ చీకటి...
11.ఆదర్శం:నలుపు నలుపు
12.తోటరాముడు: నేస్తం చూడరా...
13.ఒక తల్లి పిల్లలు
14.రాజూ – పేద: చిన్ని నాన్న...
15.రామదండు
16.దసరాబుల్లోడు
17.ఆకలిరాజ్యం:సాపాటు ఎటూలేదు..
18.కే.డీ.నెం.1: ఎస్ నేనే నెంబర్ వన్...
19.తాళిబొట్టు
20.ముందడుగు
21.ముందడుగు
22.మల్లెపువ్వు
23.ఆత్రేయ సాహితీ ఏడవ సంపుటి పుట.176
24.ఆత్రేయ సాహితీ ఏడవ సంపుటి పుట.174
25.ఆత్రేయ సాహితీ ఏడవ సంపుటి పుట.175
26.ఒక తల్లి పిల్లలు
27.మల్లె పువ్వు
28.ఎదురీత(కాంతారావు)
29.డబ్బెవరికి చేదు
30.డబ్బెవరికి చేదు
31.డబ్బెవరికి చేదు
32.ఆలు మగలు
33.డ్రైవర్ రాముడు
34.సుమంగళి
35.తేనె మనసులు

# ఆత్రేయ పాటల్లో శృంగారం

శృంగారం రసరాజం, శృంగారం ఏవ మధుర: – పరప్రహ్లాదనోరస: అని ధ్వన్యాలోకకర్త ఆనందవర్ధనుడు అన్నాడు. ఆత్రేయగారి దృష్టిలో శృంగారమంటే –

"వయసూ సొగసూ మనసూ
కలిసినవాడే రొమాన్సీ "[1] అని అంటారు. అలాగే
" చదివేటందుకు పుస్తకమెందుకు
బ్రతికేటందుకు చదువే ఎందుకు
మగువ మనసు సగం చదివితే
మగవాడప్పుడు డాక్టరాఫ్ రొమాన్స్ "[2] అని అంటారు.
(షి వుంటేనే కారులో షికారు – స్నేహబంధం)

ఆత్రేయ శృంగార రసాన్ని వారిపాటల్లో ఎంత రసవత్తరంగా పోషించారో వారి పాటల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఆత్రేయ శృంగారాన్ని శృతిమించని రీతిలో శృతిమించినరీతిలో ఇంకా చెప్పాల్సివస్తే బూతులుగా ఉన్నట్లు ప్రేక్షకులు భ్రమించే విధంగా రాశారు – రాయక తప్పలేదు ! అందుకే –

" నా సినిమా సాహిత్యాన్ని గురించి మరికొన్ని నిజాలు చెప్పాలి. నేను రాసినవన్నీ మంచివికావు. కొన్ని చెత్తపాటలూ రాశాను. కొన్ని బూతులుగా ధ్వనించేవి రాశాను. సినిమాకవి బ్రతుకు అనేకానేక అభిరుచులు గల విటులను సంతృప్తిపరచవలసిన పడుపువృత్తి "[3] అని బాధపడిన రోజులున్నాయి. సినిమా రచయితలైన వారు అన్నిరకాల పాటలను రాయవలసి వుంటుంది. రాయగలగాలి. ఇలాంటి పాటలను ఒకరు రాయనని మడిగట్టుకు కూర్చుంటే మరొకరు రాయడానికి ముందుకొస్తారు తప్పించి ఆవిధమైనటువంటి పాటల రచన ఆగిపోదుకదా ! ఇంకా చెప్పాలంటే ఇలాంటి పాటలను రాయడం సులభం కాదు. దీనికీ ప్రతిభ అవసరం.

చాలామంది శృంగారగీతాలను వింటూనే, చూస్తూనే 'బూతు' అని అంటుంటారు. ఇలాంటి వారిని ఉద్దేశించి " సెక్స్ అన్నది అన్ని కళల్లోనూ వుంది. ఉండి తీరాలి. సెక్స్ ఉండడం నేరం కాదు. పాపము కాదు. సినిమా పాటల్లోనూ, సినిమా సాహిత్యంలోనూ బూతు వుందంటూ అంటారు. నా ఉద్దేశ్యంలో సినిమాల్లో బూతులేదు. అది చూసేవాళ్ళ హృదయాలలో ఉంది. ఏదైనా సందర్భరహితంగా ఉంటేనే బూతు. అలాగే సినిమా పాటల్లోనూ, మాటల్లోనూ సందర్భంగనుక ఉంటే ఏది బూతుకాద"[4]ని శ్రీశ్రీగారు అంటారు.

ఆత్రేయ శృంగారంను తగినస్థాయిలో పలికించాల్సిన వచ్చినప్పుడు

" శృంగార సీమంతిని
నా జీవన మందాకిని
నీ కన్ను సన్న సయ్యాటలో
నను జీవించనీ మరణించనీ"[5] అని రాశారు.

అదేవిధంగా

" పరికిణీలు కట్టినప్పుడు లేని సొగసులు
నీపైటకొంగు చాటున దోబూచులాడెను"[6] అని పడుచుదనం వచ్చే కొద్ది యువతిలో కలిగే శారీరక మార్పులను శృంగారభావంతో చెప్పారు.

ఒకోసారి మితిమీరిన శృంగార భావాన్ని రాయవలసి వస్తే –

" అలవాటు లేదని మడిగట్టుకోకు
అందాన్ని కాదని చెడగొట్టుకోకు
తొలిసారి వదిలేస్తే పొరబాటూ అదే
పదిసార్లు రుచి చూస్తే అలవాటు " అని శృంగారేచ్ఛపట్ల ఆ శృంగారనాయిక నాయకుడ్ని ప్రేరేపిస్తున్నట్లు రాస్తూ..

" సొగసంతా ఎగబోసుకొచ్చాను నేను
వయసంత నిలమేసుకున్నావు నీవు
గుటకలువేస్తుంది నీపిరికి మనసు ! నీ
గుట్టంత ఈ గడుసుపిల్లకే తెలుసు
అనుభవం లేదంటే నీతప్పుకాదు
ఆశలే లేవంటే నేనొప్పుకోను
తెగబడి నీబెదురు తీర్చుకోనువ్వు
తెల్లార్లు నీనిదురనావుతానేను "[7] అని శృంగారనాయిక అంటున్నట్లు రాశారు ఆత్రేయ. " తెల్లార్లు నీ నిదుర నావుతానేను" అనే వాక్యంలో శృంగారభావాన్ని తారాస్థాయికి తీసుకెళ్ళారు.

శృంగార పరమైన కార్యకలాపాలకు శృంగార ప్రియులకు రాత్రివేళ ఓ దివ్యముహూర్తం కాబోలు! ఇలాంటి రాత్రివేళలో విరహంతో వేగిపోతు నాయకునితో ఏమంటుందంటే –

" రా..రా..
రాత్రివేళ మంచిది
నెత్తురుడికే జామిది
నీతోవగలు సెగలౌతున్నది
వగలు తీరని పడుచుకోరిక
పడగ ఎత్తి ఆడుతున్నది
రేపురాదు నీ పౌరుషాన్ని ఆపరాదు
తీర్చుకోరా నీవేడిప్పుడే అర్చుకోరా"[8] అని అంటుంది.

శృంగారంనకు స్థాయీభావమైన రతిపట్ల ఆసక్తిని కనబరుస్తూ శృంగారనాయిక శృంగారభావనను నాయకునిలో రేకెత్తించడానికి ఏమంటున్నదో విందాం !

" కన్నెగా నీకోసం కాచుకొని వున్నాను
ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నాను
అనుభవం నీకుంది. ఆశేమో నాకుంది
అన్నింటిని మించిన ఈవెన్నెల రాత్రుంది" అంటూ సూదుల్లా పొడిచే వెన్నెలకు తాళలేక తోడుకోసం రతిపట్ల ఆసక్తితో

" అగరొత్తిలా రాత్రికరిగి పోతుండాలి
హమేషా నిషాలో తమాషా ఖుషీలో
మస్తుమస్తుగా తేలిపోవాలి.
మొహబత్ మజా తెలుసుకోవాలి"[9] అని ఆశతో నాయకుడ్ని రెచ్చగొడుతున్నట్లు రాస్తారు ఆత్రేయ.

శృంగారంలో అనుభవం వున్న అబలామణి ఏమంటుందంటే..

" అందాలన్ని ముందర పరచి
అంతులేని భోగాలిస్తా

వింత వింత విందులు చేసి

వెర్రివాణ్ణి చేస్తా

మళ్ళీ మళ్ళీ రప్పిస్తా "[10]

అని శృంగారంలో ఆమె ప్రతిభను నిరూపించుకునే దానిలా అంటుంది. ఇలా శృంగారంనకు స్థాయీభావమైన రతిపట్ల నాయిక ఆసక్తిని కలిగినట్లు, రేకెత్తించేటట్లు ఆత్రేయ రాయడమే కాక పరిశీలనాత్మక దృష్టితో " విశాలి " చిత్రంలో అద్భుతమైన ఒక శృంగార గీతాన్నిరాశారు. అది ఏమిటంటే...

ఒక ఆడపిల్లకు వయసు వచ్చేకొద్ది సహజంగా శరీరపరంగా వచ్చే మార్పులేకాదు. మానసికంగా ఆ యువతి ఆలోచనలలో, అనుభూతులలో కలిగే మార్పులు కూడా ఉంటాయి. ఇలాంటి మార్పులతో యౌవనంలోకి అడుగుపెట్టిన గడసరిపిల్ల ఏమంటుందంటే...

" చల్లగాలికిలా జలధరించి ఎరుగను

మల్లెపూలకింత మత్తుందని ఎరుగను

పైటకొంగు తొలగిన ప్రక్కనెవరు నడిచిన

సిగ్గుపడి ఇటూ అటూ చూసి ఎరుగనూ

వానైనా ఎండైనా వెన్నెలైనా చీకటైనా

నిన్నదాకా లెక్క లేదురా

నేడు వానంటే దిగులు వెన్నెలంటే సెగలు

చీకటైతే గుబులు గుబులురా

నిదుర రాదురా పొద్దుపోదురా

ఈ అవస్థ మొన్నదాకా నేను ఎరుగను "[11] అని వయసురాక ముందు అనుభవించిన అనుభూతులకు, వయసు వచ్చాక అనుభవించిన ఆదేరకమైన అనుభూతులలో ఆమెకు వ్యత్యాసం కనిపిస్తుంది.

" కళ్ళు తెరచుకునే కలవరించి ఎరుగను

నిన్న కన్న కలలు నెమరువేసి ఎరుగను " అని చెప్తూ –

" కోడె వయసు తరిమినా

కొసరి ముద్దలడిగినా

మూడుముళ్ళు పడేవరకు నీకు దొరకను " [12]అని గడుసుగా, సొగసుగా, కొసమెరుపుగా అన్నట్లు రాశారు ఆత్రేయ. ఆదేవిధముగా యువతి నడకను శృంగారాత్మకంగా ఆత్రేయ ఎలా రాశాడో చూద్దాం.

" పిడికెడు నడుముకు పిరుదులు బరువై

అడుగడుగున ఊగింది

బారెడు జడ ఆరెంటికి జతగా

జరజరలాడుతు పాకింది".

ఇలా నడకలో యువతి శారీరక కదలికలను శృంగారంగా రచిస్తూ గాలికి ఎగిరే ఆమె పైటను చూసి

"మూరెడు కొంగు దోరవయసును

మూసి పెట్టనని ఎగిరింది

పుట్టెడుసిగ్గు బుగ్గలనిండా

బుసబుసమంటూ పొంగింది"[13] అంటూ శృంగారాత్మక దృష్టితో నడకను గమనించి వర్ణనాత్మకంగా రాశారు ఆత్రేయ.

ఇక యుగళగీతాల్లో కూడా శృంగారాన్ని ఆత్రేయ ఎలా పండించారో చూద్దాం ! ఆత్రేయగారి భావనాశక్తి అత్యద్భుతమైనది.

సాధారణంగా శృంగార రసానికి ఉద్దీపములుగా చంద్రుడు, చందనమును మొ॥ వాటిని గుర్తించారు. ఆత్రేయగారైతే ప్రకృతిని అందులోని పువ్వులు, తుమ్మెదజంటలు, వెన్నెలను, మంచును, వర్షాన్ని ఇలా ఎన్నింటినో గ్రహించారు. అయితే ఇక్కడ నీటిలో కన్పించే నాయికా నాయకుల నీడలను ఉద్దీపములుగా గ్రహించి శృంగార భావాలను ఎలా పండించారో పరిశీలిద్దాం.

" ఏటి ఒడ్డున కూచుంటే
ఏరుగలగలమంటుంటే" అనే ప్రియుని మాటలకు అతని ప్రేయసి
" నీటిలో మన నీడలు రెండూ
వాటేసుకుపోతుంటే' అని ఆమెకు కలిగిన భావనను చెప్పబోతుండగా –
" ఓయమ్మా ఓయమ్మా ఈ జానెడుదూరం
ఓపలేక పోతున్నాను ఓయమ్మ "[14]

అంటూ శృంగారోద్దీపిక భావాన్ని వెల్లడిస్తాడు ఆమె ప్రియుడు. మనం మామూలుగా చూసే ఇలాంటి దృశ్యాలను ఆత్రేయ మనలాగే చూడక కవిగా గొప్పభావనతో శృంగార గీతంగా ఆ దృశ్యాన్ని మాటల్లో మలిచారు.

శృంగారం గూర్చి పరస్పరాభిరుచితో వున్న ఒకజంట ఏమనుకుంటున్నాయంటే –

"అ : మోజులు పెరగాలి
ఆ : వాటిని చేతులు చేయాలి
అ : సుఖాల లోతులు చూడాలి
ఆ : నీ ఒడిలో సోలిపోవాలి
అ : అలుపూ సొలుపూ ఎరుగని పరువం అంతుచూడాలి"[15] అని అభిలషిస్తున్నట్లు రాస్తారు. అదే విధముగ

" కొంగు చాటులో వయసు
పొంగులన్నీ దాచావు
కోలకళ్ల జాడలో
గుట్టుకాస్త చెప్పావు " అని ప్రియుడంటే..
" కోరివలచి వచ్చాను .. నీ
కోసమెన్నో తెచ్చాను
గుట్టుచప్పుడు లేక – నీ
సొంతమే చేసుకో " అని ఆమె గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాశారు.

ఇలా శృంగారగీతాలెన్నింటినో రసవత్తరంగా అలవోకగా రాశారు శృంగారకవి ఆత్రేయ.

చివరిగా ఒకమాట. ఉత్పత్తి పునరుత్పత్తితో ఈ ప్రపంచాన్నే ముందుకు నడిపించేది ఈ శృంగారం. శారీరక అవసరతకు, మానసోల్లాసానికి, మానవుల పుట్టుకకు ఈ శృంగారభావాలే స్ఫూరకాలు. పైకి మనం ఈ భావాలను ఎంత చీదరించుకున్నట్లు నటించినా ఈ భావాలతోనే సృష్టిని పరిరక్షించుకుంటూ కుటుంబ జీవితాన్ని,జీవనాన్ని విస్తరించుకుంటుంది ప్రాణికోటి. దైనందిన మానవ జీవితంలో భాగంగా ప్రముఖస్థానం వహించే ఈ శృంగార భావం మనిషిలో స్వతహాగా కలగాలని, జాబిల్లిని మబ్బు కమ్మేసిన మాదిరి భావాన్ని అలా మరుగుపరచి నర్మగర్భితంగా..

" వేళా పాళా ఉండాలమ్మా దేనికైనా – నువ్వు
వేగిరపడితే రాదమ్మా తేరగా వచ్చేదైనా
కోరిక నీలో ఎంత వున్న
తీర్చే మొనగాడెదుట వున్నా
వేడి ఎక్కడో పుట్టాలి

నీ వేడుక అప్పుడే తీరాలి "[16]

అని పైపైకి ఎగిసిపడే కోడె వయసు కుర్రదాన్ని ఉద్దేశించి – అలాంటి సమయంలో మగవాడిలో సహజంగా కలగాల్సిన శృంగారోద్దీపిక భావాలను గూర్చి అద్భుతంగా రాశారు శృంగారకవి ఆత్రేయ.

# పాదసూచికలు

1.గుమాస్తా: డాన్స్‌బేబీ డాన్స్....
2.స్నేహబంధం: షి ఉంటేనే కారులో షికారు...
3.ఆత్రేయసాహితి ఏడవ సంపుటి పుట.194
4.శ్రీశ్రీ వ్యాసాలు(1970,1983)పుట.154
5.అభిమన్యు
6.బడిపంతులు: నిన్నమొన్న...
7.నా తమ్ముడు
8.సత్యానికి సంకెళ్ళు
9.ప్రజా నాయకుడు
10.అమ్మాయిల శపథం
11.విశాలి:నిన్నదాక...
12.విశాలి:నిన్నదాక...
13.తాళిబొట్టు
14.ఇదా లోకం
15.బంగారు బాబు: ఏడడుగుల సంబంధం
16.అల్లుడొచ్చాడు

# ఆత్రేయ వేదాంతం

" వేదాంతం, వైరాగ్యం ఒంటపడితే చాలా ప్రమాదం. వాటిజోలికి పోకుండా వుంటే చాలా మంచిది. అవి మనిషిలోని కార్యదీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి. మనలో వున్న ఉడుకురక్తం మీద చన్నీళ్లు చల్లి చల్లబరుస్తాయి "[1] అని అంటారు వేదాంతకవి ఆత్రేయ. ఇలా వేదాంతం బాగా వంటపట్టినవాడు ఆత్రేయ. కరుణంలో వేదాంతాన్ని పలికించడం ఆత్రేయశైలి. ఇది ఆత్రేయశైలే కాదు. మానవ నైజం ! ఇలాంటి వేదాంత భావాలతో ఎన్నో రచనలు చేశారు, వేదాంతసారాన్ని తెలిపారు.

" తెలిసేట్లు చెప్పేది సిద్ధాంతం – అది
తెలియక పోతేనే వేదాంతం "[2] అని వేదాంతం గూర్చి వ్యంగ్యంగా చెప్పారు ఆత్రేయ.

వేదాంతం మనిషిని వాస్తవిక దృష్టితో ఆలోచింపచేసే సన్మార్గంలో నడిపిస్తుంది. ఏవిధంగానంటే కొందరు జీవితకాలమంతా ఏదో ఒక మోహంతో – వ్యామోహంతో, ఆశతో –అత్యాశతో అందీ అందని దానికోసం ఆరాటంతో అందుకోవాలని పరుగులు తీస్తూ ఉంటారు. ఇంకొందరు ధనమున్నదనే అహంకారంతో తనకంటే తక్కువవారిని పురుగుల్లాగా చూస్తారు. ఒక్కసారి నీ శరీరం గురించి ఆలోచించు మానవ అంటూ.. నీటి బుడగలాంటి ఈ మానవజీవితం గురించి ఆత్రేయ ఏమి చెప్పారంటే –

"మానవ ఏమున్నది ఈదేహం
ఈ రక్తమాంసములు అస్థిపంజరం
దీనిపై ఏలరా ఈ వ్యామోహం
నవమాసాలు కడుపున చెరడి
నవరంధ్రాలతో భూమిపై దిగబడి
నవనవలాడి జవజవలాడి
నశించే బొమ్మరా ఈ నరజన్మ
ఊపిరాడేవరకే నేనూనాదను మమకారాలు
ఆపై వల్లకాటిలో ఉండవు ఏ తేడాలు
మట్టిమట్టిలో గాలిగాలిలో
మాయమౌ బొమ్మరా ఈ నరజన్మ "[3]

అని మానవజీవిత రహస్యాన్ని బట్టబయలు చేసారు తన వేదాంతభావంతో. ఇలా ఆలోచిస్తే అధికుడ్నని విర్రవీగేవాడు అల్పునిగా, అహంకారి– నిరహంకారిగా, దుర్మార్గుడు – సన్మార్గునిగా మారక తప్పదు !

శాశ్వతంగా ఈ భూమిపై పాతుకుపోయే వారిలాగా ఎన్నాళ్లు, ఎన్నేళ్లు బ్రతుకుతామో కూడా తెలియదు. వాడిపోయిన పువ్వులా రాలిపోయే ఈ శరీరాన్ని నమ్ముకొని స్వార్థంతో అంతానాదని ప్రాకులాడే వారిని, పదవులతో, ఐశ్వర్యంతో కన్నుమిన్నూ కానరాని వారిని ఉద్దేశించి..

" మట్టిబొమ్మలే మనమంతాను
గిట్టిపోవలె మట్టిలోపలే "[4] అని మన పుట్టుక గూర్చి చెప్పారు ఆత్రేయ.

అసలు మానవజీవితమే విచిత్రమైనది. బంధాలు – అనుబంధాల శ్వాసతోనే మనిషి బ్రతుకుతున్నాడనిపిస్తుంది. అందుకే ఆత్రేయ –

" పుట్టిపెరిగేది భూమిపైన, గిట్టికలిసేది మట్టిలోన
ఎన్నిబంధాలు ఇంతలోన

ఎవరు నీవారు చివరిలోన "[5] అని అంటారు.

ఈ బంధాలు నీవున్న వరకే ! ఈ బంధాలు మిడిచి నీవు పోతున్నవుకదా! నీతోపాటునేనూ వస్తాను అని వచ్చే బంధాలు కాదు. అందుకే..

" ఈ జీవన తరంగాలలో
ఆ దేవుని చదరంగంలో
ఎవరికి ఎవరు సొంతము
ఎంతవరకీ బంధము.. ?"[6] అని అంటారు ఆత్రేయగారు.

పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు. ఈ భావనను దృష్టిలో పెట్టుకొని ఆత్రేయ –

" ఈ అనంత కాలగమనంలో
నీ రవంత జీవన పయనంలో
అందరు నీవారు
చివరకు మిగిలేదెవరూ లేరు "[7] అంటాడు.

పోయినవాళ్ల గూర్చి బాధపడేవాళ్ళనుద్దేశించి

" రారయ్య పోయినవాళ్ళు
ఎవరయ్యా ఉండేవాళ్ళు "[8] అని అంటారు ఆత్రేయగారు. అంతేకాదు –

" నన్నడిగి తల్లితండ్రి కన్నారా – నా
పిల్లలే నన్నడిగి పుట్టారా
పాపం పుణ్యం నాది కాదే పోవే పిచ్చమ్మా
నారు పోసి నీరుపోసే నాధుడు వాడమ్మ
ఏదినీది – ఏదినాది " అని అనడమేకాదు –

"తొలుత యిల్లు తుదకు మన్ను
ఈ బ్రతుకెంత దాని విలువెంత ఓ చెల్లెలా
ఏలా యీ స్వార్థ ఏది పరమార్థం "[9] అని కథానాయిక అన్ననోట వేదాంత ధోరణిని పలికిస్తారు ఆత్రేయ.

వేదాంత గీతాల్లోకెల్లా ప్రత్యేకమైనది ఈగీతం. వేదాంత భావంతో వ్యంగ్యంగా రాయబడిన ఈ గీతంలో ఆత్రేయ ఏమంటున్నారంటే –

" నవ్వండి
నవ్వే వాళ్ళతో నవ్వండి
నాలుగు ఘడియల నరజీవితము
నవ్వులతోటగ చేయండి
అది నవ్వలతోటగ చేయండి
వచ్చినవాళ్లు పోతారు
పోయినవాళ్లు రాబోరు
ఈ రాక పోకల సందున ఉంది.
రంజైన ఒక నాటకము
కదలిస్తే అది బూటకము
అది అంతా ఎందుకుగానీ

అనుభవించిపోనీ జీవిని
అనుభవించిపోనీ
ఉండేది ఎంతకాలమో
ఊడిపోతాము ఏక్షణమో
రేపన్నది రూపులేనిది
ఈ దినమే నీకున్నది
అందాన్ని ఆనందాన్ని
అనుభవించి పోనీ "[10]

ఆశాశ్వతమైనది ఈ మానవ జీవితమని గుర్తించక ఏవేవో చేస్తుంటాము. అందుకే –

" ఓ బాటసారి.. ఇది జీవిత రహదారి
ఎంత దూరమో ఏది అంతమో
ఎవరూ ఎరుగని దారి ఇది
ఒకరికి సొంతంకాదు ఇది"[11] అనే సత్యాన్ని గ్రహించి బ్రతికినంతకాలం సన్మార్గంలో మనిషిగా బ్రతకమని అంటారు ఆత్రేయ.

సృష్టిలో జన్మించిన ప్రతిప్రాణికి మృత్యువు తప్పదు! ఇది మనందరికీ తెలిసిన విషయమే. తెలిసినప్పటికి మనవారెవరైనా చనిపోతే బోరున విలపిస్తాము. ఇలా విలపించేవారిని చూసిన ఆత్రేయ కొంతవేదాంత భావంతో, తార్కికవాదంతో 'శాంతినివాస్' చిత్రంలో – 'చావనేది ఎవ్వరికీ తప్పదు " అంటారు. మరి ఇంత తెలిసి ఏడ్చేదెందుకు? మీరే ఆలోచించండంటూ..

"పుట్టినోళ్ళు సావకుండా ఏమవుతారు...?
సచ్చినోళ్ళు పుట్టకుండ యాడుంటారు...?
ఇది తెలిసినోళ్ళు యెవ్వరూ ఏడవరు
ఏడ్చామని సచ్చినోళ్ళు బతకరు " అని అంటారు.

నిజమే కదా! దినాలుగా ధారాపాతంగా ఏడిస్తే; మనమేడుస్తున్నామని చచ్చినోళ్లు తిరిగి బ్రతకరు కదా! మరెందుకు ఏడవడం అంటారు ఆత్రేయ. 'ఈరోజ'నేది రేపటికి 'నిన్న'గా మారుతుంది. అలాగే 'రేపు' అనుకున్నది కూడా కాలప్రవాహంలో కొట్టుకొని రానేవచ్చింది. ఈ అనంత కాలభ్రమణంలో 'నిన్న' అనుకున్న రోజుకూడా 'మొన్న'గా మారక తప్పదు. దీనిని ఆపేశక్తి ఎవ్వరికీ లేదు. ఎవ్వరెన్ని తప్పించుకున్నా దీని నుంచి తప్పించుకోలేరెవ్వరు, అందుకే కాలస్వరూపం ఎరిగిన ఆత్రేయగారు –

"నేడు నిన్నౌతుంది–రేపు నేడౌతుంది
ఆ రేపుకూడ నిన్నగా మారుతుంది
కాలం దేన్నిరా పాపమని ఆపుతుంది" అని చెప్తూ ఏడ్చేవాళ్ళను చూసి నవ్వుకుంటారు. ఎందుకంటే –

" పోయినోళ్ళకోసం పోబోయే– నువ్వు
ఏడ్చేది తలుసుకుంటే నవ్వొస్తుంది" అని అన్నారు.

ఇలా ఆత్రేయ తనపాటలతో, మాటలతో మన మనోనేత్రాలు తెరవడానికి వేదాంత భావాలనెన్నింటినో వినిపించారు.

# పాదసూచికలు

1.ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట 186

2.అంతులేని కథ: దేవుడే యిచ్చాడు వీధి ఒకటి

3.చక్రధారి

4.గుమాస్తా:పరుగెక్కడికోయీ...

5.ఆదర్శవంతుడు

6.జీవన తరంగాలు

7.సంధ్య

8.గాజుల కిష్టయ్య

9.అంతులేని కథ

10.అర్ధాంగి: ఏడ్చేవాళ్ళను ఏడవనీ...

11.ఇల్లాలు

# ఆత్రేయ దైవం

ముప్పదిమూడుకోట్ల దేవతలు ఎగబడ్డ దేశం మనదని మహాకవి జాషువా అన్నారు. ఊరికోదేవుడు, వీధికోదేవుడు ఇంటికో దేవుడు. ఆ దేవుడు ఈ మతానికి చెందినవాడు – ఈ దేవుడు ఆ మతానికి చెందినవాడనే వాదనలు, విధానాలు, విధ్వంసాలు, కులమత ఘర్షణలతో రక్తతర్పణం... ! ఇదీ ! ఈ మనుషుల దైవభక్తి. ఇదీ వారిదేవుడు సంతోషించే పుణ్యకార్యం! ఆలోచనలేకుండా ఆవేశంతో మానవులు దానవులుగా చెలరేగడాన్ని చూసి ఆత్రేయ నవ్వారు – ఏడ్చారు. ఈ నేపథ్యంలో దైవంపట్ల ఆత్రేయలో పెల్లుబికిన ఆలోచనల సారాంశమే ఈ వ్యాసం.

దేవుని గూర్చి ఆత్రేయ నాస్తికునిగా, ఆస్తికునిగా రెండువిధాలు ఆలోచించి ఎన్నో విషయాలు చెప్పారు. దైవంగూర్చి పోతనకి "కలడో లేడో"[1] అనే భావన ఎలా ఉందో అదే భావన ఆత్రేయకు ఉంది. ఆత్రేయ నాస్తికుడా ? ఆస్తికుడా? రెండింటికీ తటస్థుడా అనేది కాదు ప్రధానం. దైవం పట్ల వారు వ్యక్తపరచిన భావాలు ఎంత ఉదాత్తమైనవో పరిశీలించడమే ప్రధానం.

" నాకు పనే దేవుడు. పనిచేయటమే దైవారాధన. పనిలో ఆత్మవంచన చేసుకోకుండా బ్రతకటమే దైవభక్తి"[2] అని దైవంపట్ల ఆత్రేయ తన భావనని సూటిగా చెప్పారు.

" దేవుడే లేడనే నాస్తికులకు
మానవుని మీద, మానవత్వం మీద
మానవునిలో పెరిగే దైవం మీద
నమ్మకం ఎక్కువ "[3] అని నాస్తికుల భావాలను సమర్థిస్తూ అంటారు. అదేవిధముగా కపట ఆస్తికులను ఉద్దేశించి, – "భయం వల్ల దేవుడున్నాడని పూజించడం కంటే నిర్భయంగా దేవుడు లేడనడం ఉత్తమం!"[4] అని విమర్శిస్తారు. ఇక మూఢ విశ్వాసాలతోనూ సాంప్రదాయాలు – ఆచారాల పేరుతో దేవుళ్ళను వాళ్ళ ఇష్టానుసారం పూజించేవారి గురించి –

" రోజు పూజలు చేసే వాళ్ళకు
దేవుడు ఒక ఆటబొమ్మ
వాళ్ళకి ఇష్టం వచ్చిన పువ్వులు పెడతారు
బట్టలు కడతారు, నైవేద్యం పెడతారు.
అందుకని వాళ్ళకు భయమూ లేదు. భక్తిలేదు"[5] అని విమర్శిస్తారు ఆత్రేయ.

దేవుడు ఉన్నాడా లేడా అనే ఆలోచనలతో సతమతమయ్యేవారిని ఉద్దేశించి –

" దేవుడు వున్నాడోలేడో
మానవుడున్నాడురా
వాడే దేవుడు కలడు లేడని
తికమక పడుతున్నాడురా
మానవుడున్నంతవరకూ దేవుడు వుంటాడురా
వాడిని తలచేందుకు మానవులుండాలిరా " అని దేవుని పట్ల మానవునికి గల ఆలోచనలు ఎలా ఉన్నాయో చిత్రించాడు.

ఆత్రేయగారి అభిప్రాయం ప్రకారం మతాలు ఎలా రూపొందాయి అంటే...

" తనలో మంచిని పెంచుకునేటందుకు
తానే దేవుడు అయేటందుకు
మనిషి కొక రూపం కల్పించాడు
అది మనిషి మనిషికొక రూపమై
పలుమతాలుగా మారాయిరా " అని అంటారు.

భయం నుంచి, భక్తి నుంచి దేవుడు, దైవత్వం పుట్టాయి అంటారు. ఇక 'ముక్తి' అంటే ఆ భయం భక్తులను మించిన స్థితే అంటారు ఆత్రేయ.

దేవుడు దేవుడనే మనుషుల్లో ఏమనిషి దేవుడ్ని చూశాడు ? చూడని దేవుడ్ని గూర్చి చూస్తూ చస్తూ నరలోకాన్ని నరహత్యలతో నరకం చేస్తున్నాడు ఈ మనిషి. అందుకే ఆత్రేయ నిజమైన దేవుడు ఎవరో ఇలా చెప్పారు.

" మనిషి కోసం బ్రతికే మనిషే దేవుడు
దేవుడి కోసం మనిషిని మరచేవాడు మూఢుడు
ప్రేమ..త్యాగం...తెలిసిన వాడే మానవుడు
దేవుడి పేరిట మూఢుడైతే వాడే దానవుడు " అని అంటారు.ఆత్రేయగారి మాటలను బట్టి ఈ లోకంలో మూఢులు. దానవులే ఎక్కువగా ఉన్నట్లుంది. ఇలాంటి వారు ఈ నిజాన్ని గ్రహించి దేవుళ్లుగా మారాలని ఆత్రేయ ఆశ. దేవుడెవరని ఇంకా స్పష్టంగా చెప్తూ...

" మనసున్న మణుసులే మనకు దేవుళ్లు "[5] అని అంటారు ఆత్రేయ. నిజమే మనసున్నవారు ఎవరూ మతం పేరిట మతోన్మాదకార్యాలను తలపెట్టి హింసలు సృష్టించరు. అన్ని మతాలు ఒక్కటే అనే సమభావనతో ఉంటారు. నిజంగా ఇలాంటి వారే మనకు కన్పించే అసలైన దేవుళ్లు. అందుకే ఆత్రేయ –

" ఎక్కడో లేదులే దేవుడు
నువ్వెక్కడుంటే అక్కడే వున్నాడు
మమతులున్న మనసులో కొలువుంటాడు
కరుణగల కళ్లలో కనిపిస్తాడు "[6] అని చెప్పారు.

లోకంలో జరిగే అవినీతి, అక్రమాలు, అన్యాయాలను బట్టి దేవుడు, మానవుడు, పరస్పరం ఒకరిపట్ల మరొకరికి కలిగే సందేహాన్ని, దేవుడు రాయిగా, ఆ రాయిని చూసిన మనిషి నాస్తికునిగా మారిన వైనాన్ని అతి చక్కని భావనతో " దాగుడు మూతలు" చిత్రంలో ఇలా చెప్పారు.

"దేవుడనే వాడున్నాడా అని మనిషికి కలిగెను సందేహం
మనుషులనేవారున్నారా అని దేవుని కొచ్చెను అనుమానం "

లోకంలో అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్న చేస్తున్నవారికి శిక్షించేవిధంగా దేవుడు ఎక్కడ? ఉంటే ఎందుకురాడు? అలా రానివాడు దేవుడా ? అసలు ఉన్నాడంటావా ?... ఇలా మనిషికి దేవునిపట్ల విశ్వాసం సడలి దేవుడు ఉన్నాడా లేడా అనే సందేహం కలిగితే, మతం పేరుతో మారణకాండలు, మనషిని మనిషి చంపుకోవడం, ఆక్రమమైన మార్గాలలో దోచుకొని బ్రతకటం, చివరికి తననే అడ్డం పెట్టుకొని సొమ్ము చేసుకునే దొంగస్వాములను, పూజారులను, కపటభక్తులను చూసిన అ దేవునికి ఈ భూమ్మీద ఉన్నవారు మనుషులేనా ? అని మనిషిపట్ల అనుమానం కలిగినట్లు చక్కని ఊహాత్మక భావనతో ఆత్రేయ చెప్తూ...

" మనసులేని ఈ మనిషిని చూసి దేవుడు రాయైపోయాడు
ఆదేవుడు కనబడలేదని మనిషి నాస్తికుడైనాడు" అని అంటారు.
మారని మనసులు మనుషులు ఈ మానవులు మొదట.

"మనిషికి మార్గం చూపాలనుకొని
దేవుడు మనిషై పుట్టాడు
ఈ జగతిని యాతన పడలేక
మళ్ళా దేవుడైనాడు " అని అంటారు ఆత్రేయ.

దేవుడైనవాడు ఇలలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, హింసలు చూడలేక శిలగా మారితే ఆ శిలను చూసిన మనిషి దేవుడులేడని నాస్తికుడైనట్లు గొప్ప కల్పనాభావంతో, తార్కికంగా చెప్పారు ఆత్రేయ. ఇదే భావనను పునాదిగా చేసుకొని ఈలోకంలో నిర్భాగ్యంగా, దయనీయంగా, పుట్టే / పుట్టిన మూగ, చెవుడు, గుడ్డివారి పుట్టుకకు కారకుడు ఆ దేవుడేనని భావనాకల్పనతో ఆత్రేయ ఇలా రాశారు.

" దేవుడు లోకంలో కొందరు దేవుళ్ళను సృష్టించాడు
పసిదేవుళ్ళను సృష్టించాడు
వాళ్ళను కూడా తన వలెనే
మూగ చెవుడు గుడ్డిగా చేసేడు " అని వ్యంగ్యంగా విమర్శిస్తూ అంటారు.

వారు అలా పుట్టడానికి గల కారణాన్ని ఆ పసిదేవుళ్ళతో ఆత్రేయ ఈ విధంగా చెప్పారు.

" మనిషి మనిషి చేసే దోపిడి చూసే దేవుడు భరించలేక
కళ్ళు మూసుకున్న వేళ
పెద్దల స్వార్థం చేసే ప్రార్థన – పేదల వేదన వినలేక
చెవులు మూసుకున్నాడు
ఎదురు తిరిగి మానవుడడిగే ప్రశ్నకు బదులే
చెప్పలేక నోరు మూసుకున్నప్పుడు
పుట్టారమ్మ మీరు
అతని తప్పులు గుర్తుగ ఉన్నారు "[7]

ఈ విధంగా అంగవైకల్యం కలవారిపట్ల సానుభూతి కలిగిన ఆత్రేయ ఆ దేవుణ్ణి అలా నిందించి నిరశించారు. ఆత్రేయ దేవుడ్ని నిందించడంతోనే ఆగలేదు. ఆ దేవుని ఉనికి గూర్చే అతనిని ప్రశ్నిస్తాడు. లోకంలో ఎన్ని ఘోరాలు జరుగుతున్నా చూస్తూ ఊరుకునేవాడివి నీవా దేవుడవని ఏవిధంగా ప్రశ్నించారంటే –

" ఉన్నావా ! అసలున్నావా
ఉంటే కళ్ళు మూసుకున్నావా ! ఈ
లోకం కుళ్ళు చూడకున్నావా !
ఉన్నావని కనుగొన్నామని మున్నెందరో
అన్నారు ఉన్నావని చూస్తున్నావని నమ్మి
ఎందరో వున్నారు

నీ పేరిట వంచన పెరుగుతువుంటే
నీ ఎదుటే హింసలు జరుగుతు వుంటే
మనిషిని మనిషి దోస్తూ వుంటే
మంచికి సమాధి కడుతూ వుంటే
రాతిబొమ్మవై నిలిచావు
చేతగాని వాడనిపించావు " అని నిందిస్తూ ప్రశ్నించారు. ఇలాంటి వాడివి నీవు దేవుడవు కాదుపో అంటూ...

" నువ్వొక వ్యర్థుడవి
నీకొక పేరూలేదు, రూపం లేదు
నీతి లేదు, నియమం లేదు
నిజానికి నువ్వే లేవు ! లేవు ! లేవు ! "[8] అని ఆ దేవుడ్ని వ్యతిరేకిస్తాడు.

లోకంలో ఏమి జరిగినా శిలలా ఉంటాడే గాని ఆ దేవుడు రాడు. ఎందుకంటే " మానవుడు దానవుడై చెలరేగినపుడు" వచ్చి రక్షింపక ఆ దేవుడే ఈ మానవుల క్రూరత్వానికి భయపడి " తానెక్కడో తలదాచుకుంటాడ " ని " మనసు – మాంగల్యం" చిత్రంలో అంటారు.

లోకంలోని అసమానతలకు కూడా కారకుడు ఆ దేవుడేనని విమర్శిస్తారు ఆత్రేయ. ఏవిధంగానంటే –

" ఒకడి ఆకలికి అంబలినీళ్లు

ఒకడికి పాలూ పళ్ళు

భలే భలే దగాదేవుడు"[9] అని ఆకలికి అలమటించే వారిని చూడలేక ఆత్రేయ దేవుడ్ని అలా నిందిస్తాడు. దేవుడి మీద తిరబడి గొంతు ఇంకాస్త పెద్దది చేసి

" దేవుడివా నువ్ గారడివా

కీలుబొమ్మలను చేసి మనుషులనాడిస్తావా

చూస్తా – ఎంతకాలమాడిస్తావో

ఇంతకన్న ఏంచేస్తావో " అని తిరగబడి

" నిరుపేదలంటే నీకు నిర్లక్ష్యమా

కలవారివైపే నీకంత పక్షపాతమా

నువు దేవుడైతే నాకేమి భయమూ

నే తిరగబడితే ఆపడం నీ తరమా " అని సవాలు చేస్తాడు " ప్రతిజ్ఞ " చిత్రంలో.

దేవుడు మనిషిని చేసేటప్పుడు మనలో ఉండకూడని, పెట్టకూడని స్వభావాలను కొన్నింటిని పెట్టి ఈ భూమిమీదకు పంపి – సతమతమయ్యే మనలను చూసి ఆనందిస్తూ ఉంటాడు. ఇలాంటి దేవుడు ఏంచేస్తున్నాడో ఇలా చెప్పారు ఆత్రేయ–

" మట్టి బొమ్మలకు వూపిరి వూది

దేవుడు తమాష చేస్తున్నాడు

మతికీ మనసుకు శృతి కుదరక – ఈ

మనిషి నలిగి చస్తున్నాడు "[10] అని ఒడుదుడుకులతో ఊపిరాడక కొట్టుమిట్టాడే ఈ మానవుని మానసిక స్థితికి కారకుడు ఆ దేవుడునని నిందిస్తారు. అంతేకాదు –

" పిడికెడు హృదయం ఇచ్చాడు

కడివెడు ప్రేమను నింపాడు

అడుగున ద్వేషం దాచాడు

ఆడకత్తెరలో నొక్కాడు " అని విమర్శిస్తాడు. అదే విధముగా

" మనసులేని దేవుడు

మనిషికెందుకో మనసిచ్చాడు

మనసు మనసును వంచన చేస్తే

కనులకెందుకో నీరిచ్చాడు " అని మనసులేని ఆ దేవుడ్ని నిందిస్తాడు ఆత్రేయ.

చివరిగా ఆత్రేయ మనల్ని కోరింది ఒక్కటే..

" దేవునికి నచ్చేవి

దేవుడు మెచ్చేవి

మనం చేస్తున్నామా "[11] అని మనల్ని మనమే ప్రశ్నించుకొని సక్రమమైనా మార్గంలో దానవులుగా కాక మానవులుగా, మహాత్ములుగా, దేవుళ్ళుగా ఆ దేవుళ్ళు ఇష్టపడేవి చేయమంటారు – కడ వరకు ఆచరించమంటారు ఆత్రేయ.

## పాదసూచికలు

1. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 182
2. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 184
3. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 184
4. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 176
4. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 177
5. మూగమనసులు: నా పాట నీ నోట...
6. మరపురాని మనిషి
7. కథానాయకుని కథ
8. భక్తతుకారం
9. నాటకాల రాముడు: ఓ బుచ్చి బాబు
10. శభాష్ సూరి
11. ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట. 176

# ఆత్రేయ పాటల్లో అమ్మ

సృష్టిలోకెల్లా అతితియ్యని, కమ్మని, విలువైన పదాలు అమ్మ, తల్లి. అమ్మ ప్రేమలోని ఆప్యాయతను చవిచూసిన ఏప్రాణి ఆ ఆప్యాయతలోని ఆనందాన్ని అనుభూతుల్ని మరువలేదు. ఎందుకంటే ఆ ప్రేమలో త్యాగం, తెగింపు, కడుపు తీపి ఉండి నిష్కల్మషంగా, నిస్వార్థంగా, స్వచ్ఛంగా వుంటుంది. " అమ్మ " అని పిలువబడే ప్రతి అమ్మలో అంతర్లీనంగా ఆ గుండె గుడిలో వెలకట్టలేని ఆ తల్లి ప్రేమ నిబిడీకృతమై వుంటుంది. తల్లి ప్రేమలోని తియ్యదనాన్ని ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా తనివితీరనిది. ఈ విధమైనటువంటి ప్రేమనూ, ఆత్మీయతనూ ఆత్రేయ తన పాటల్లో ఎలావ్యక్తపరిచారో తెలుసుకుందాం.

అమ్మ ప్రేమకు సంబంధించి ఆత్రేయ రాసిన పాటల్లో అతని తల్లి ప్రభావం ఎంతో వుంది. చిన్నతనంలో తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు ఆత్రేయ. ఆమె ప్రేమను పూర్తిగా చవిచూడని ఆత్రేయ తల్లి మరణానికి తల్లడిల్లి పోయారు. తల్లి బ్రతికున్నంతకాలం తానుపొందిన అనుభూతులను, తల్లిలాంటి తల్లుల ద్వారా పూర్తిగా తెలుసుకున్న 'అమ్మ ప్రేమ ' స్వరూపాన్ని వారి పాటల్లో ఏవిధముగా ఆవిష్కరించారో చూద్దాం !

" నవమాసాలు మోసేది ప్రేమ, పేగు తెంచుకొని పుట్టిన బిడ్డకు రక్తాన్ని పాలుగా రంగరించి పోసేది ప్రేమ. తనబిడ్డ తన ఆయుషుకూడా పోసుకొని తన కళ్ళముందు నిండుగా నూరేళ్లు బ్రతకాలని అనుక్షణం పరితపించే మూగవేదన ప్రేమ"[1] అదే అమ్మప్రేమని అన్నారు ఆత్రేయ.

అమ్మమనసు పసిపిల్ల నవ్వులాంటిది. ఆ నవ్వులో కల్లాకపటమనేది ఎలా ఉండదో తల్లి మనసులో బిడ్డపై స్వార్థం తప్పించి మరేమి ఉండదు. అందుకే –

" బొజ్జలోని పాపాయి
పొరలి పొరలి తన్నినా
పొంగిపోవు కడుపుతీపి అమ్మది
కుసిలి కుసిలి పాలకై
గుండె మీద గుద్దినా
మురిసిపోవు వెన్నమనసు అమ్మది " అని చెప్తూ...

" అమ్మ వుంటే లేనిదేమి లేనేలేదు
అమ్మలేక ఏమున్నా వున్నదికాదు
అమ్మంటే త్యాగము
అమ్మే ఒక యోగమూ
అమ్మే ఒక సత్యమూ

అమ్మే ఒక సర్వస్వమూ "[2] అని తల్లిప్రేమ ఎంత విలువైనదో, ఉన్నతమైనదో చెప్పారు. తల్లి ఉన్న వాళ్ళకంటే లేనివాళ్ళకే తల్లంటే ఎవరో పూర్తిగా తెలుస్తుంది. ఎందుకంటే కళ్ళముందు కనిపించే వాటికి అంతగా గుర్తింపు, విలువను ఇవ్వము మానవులైన మనం సహజంగా. కాని తల్లిని కోల్పోయిన దురదృష్టవంతులే తల్లంటే ఎవరు అని గుండెలోతుల్లో నుంచి పెల్లుబికివచ్చే భావాలతో చెప్పగలరు. అందుకే ఆత్రేయ –

" అమ్మంటే అమ్మ – ఈ
అనంత సృష్టికామె అసలు బ్రహ్మ
రక్తాన్ని అర్పించి, ప్రాణాన్ని పూరించి
చేస్తుంది నీబొమ్మ " అని అంటారు. అంతేకాదు నీకోసం

" మరణాన్ని ఎదిరించి – మరోసారి జన్మించి

ఇస్తుంది నీకు జన్మ " అని అంటారు. ఇంత అమూల్యమైన తల్లి ప్రేమను

" ధనం పోసి కొనలేము

రుణం తీర్చుకోలేము " అంటారు. ఇంకా తల్లిప్రేమ ఎలాంటిదంటే –

" తనకు కన్ను నీవైతే

నీకు రెప్ప తానౌతుంది "[3] అని చెప్పారు.

బిడ్డగా భూమి మీద పడి ఎదుగుతుండే కొద్దీ మనిషిగా మనకు రూపాన్ని కల్పించిన తల్లిప్రేమను మనం మరువకూడదు. నిర్లక్ష్యం చేయకూడదంటారు. ఎందుకంటే –

" తొమ్మిది నెలల ఆరాటం అమ్మయిచ్చిన ఆకారం

ఉగ్గు పాలతో ఊయలజోలా

నిన్ను పెంచిన మమకారం "[4] అని గుర్తు చేశారు ఆత్రేయ.

ఏది ఏమైనప్పటికీ

" అమ్మా అమ్మా అనే మాటలలో

ఎంతటి కమ్మదనం వుందీ "[5] అని అంటారు ఆత్రేయ.

అమ్మ ప్రతి ఒక్కరికి ప్రత్యక్ష దైవం. అందుకే ఆత్రేయ.

" అమ్మా ! దైవానికి దయాస్వభావానికి

మరో పేరుగా మసలేది

త్యాగానికి అనురాగానికి

మనుజ రూపమై వెలసేది " అని అంటారు. ఇలాంటి అమ్మ వున్నప్పుడు –

" జగతి సకలం నాదైనా

బ్రతుకు పూవులబాటైనా

తల్లి మనసే గుడినాకు

తల్లిసేవే గురినాకు "[6] అని తల్లిమీద తనకు గల ప్రేమను వ్యక్తపరిచారు ఆత్రేయ. ఇలా ఆత్రేయ తన పాటల్లో తల్లిప్రేమను ఎంతో ఉన్నతంగా ఆవిష్కరించారు.

# పాదసూచికలు

1.లైలా
2.కలసిన మనసులు: అమ్మ వంటిదీ అంత మంచిదీ...
3.రామ్ రాబర్ట్ రహీమ్
4.పోరాటం: ఆది మానవుని ఆరాటం...
5.అనురాగం
6.మంచీ–చెడు

# ఆత్రేయ ప్రబోధాత్మక గీతాలు

సినిమా మీడియా అన్ని మీడియాల్లోకెల్లా గొప్పదని గుర్తించి దానిని తమ రచనల ద్వారా సద్వినియోగపరుచుకున్న రచయితలలో మొట్టమొదటివారు ఆచార్య ఆత్రేయ అని అనవచ్చేమో ! ఆత్రేయగారి దృష్టిలో సినిమా ప్రక్రియ అనేది, అందులోని పాటలు –మాటలు అనేవి కేవలం వినోదం కోసమే కాదు; ఒక మంచివిషయాన్ని కథ రూపంలోనో, పాటల రూపంలోనో, సంభాషణల రూపంలోనో రచించి చిత్రీకరిస్తే అది మంచిదని గ్రహించి– జీవితంలో దాన్ని అన్వయించుకొని, నడుచుకోగలిగే వారికి ఒక గొప్ప సాధనముగా ఈ సినిమా మీడియా ప్రభావం చూపుతుందని భావించారు ఆత్రేయ.

తాను చెప్పే విషయాలలో కనీసం ఒక మాటైనా చూసే ప్రేక్షకులకు ఉపయోగపడాలని దానిని వారు ఆచరించి జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని తపించి ఆత్రేయ రాసేవారేమో అనిపిస్తుంది. తన జీవితానుభవంలో కాచి వడబోసిన జీవిత సారాన్ని తన సాహిత్యం ద్వార తేలికగా, తేటతెల్లంగా చెప్పే కవి – ఆత్రేయ. అందుకోసం సినిమా రంగాన్నే వేదికగా చేసుకొని రచనలు చేశారు.

ప్రతి మనిషికి ప్రాణమెంత ముఖ్యమో ఆ ప్రాణికి అతని / ఆమె జీవితమూ అంతే ముఖ్యం.

" జీవితం నిప్పంటించిన సిగరెట్ వంటిది
అనుభవించినా ఆదమరిచినా
అది మాత్రం కాలిపోతుంది
తుదకు బూది మిగిలిపోతుంది "[1] అంటారు ఆత్రేయ.

అసలు ఎవ్వరూ నిర్వచింపలేనటువంటిది 'జీవితం'. అలాంటి ప్రయత్నమే చేయాలంటే ఆ మనిషి ఆఖరి దశలో చెప్పడానికి ప్రయత్నించడం ప్రారంభిస్తాడే తప్పించి చెప్పలేనిది ఈ జీవితం. అలాంటిది రుషితుల్యుడు ఆత్రేయ జీవిత లోతుపాతులను ఎన్నో చెప్పాడు.

మరుజన్మ ఉన్నదనే విషయం రూఢి అయితే ఈ జన్మలో చేసిన తప్పొప్పులను ఆ జన్మలో చేయకుండా ఉండేందుకు జాగ్రత పడవచ్చు. కాని ఎవరికి అంతుబట్టనిదికదా ఈ జన్మ – పునర్జన్మ రహస్యం!

మన జీవితంలో ఒకసారి చేసిన తప్పుకి ఫలితం, ప్రతిఫలం ఈ జీవితకాలమంతా శిక్షగా అనుభవించక తప్పదు. అలాంటివి మనం అనుభవించకూడదనే ఆత్రేయ –

" అందమైన జీవితము అద్దాల సౌధము
చిన్నరాయి విసిరినా చెదిరిపోవును
ఒక్కతప్పుచేసినా ముక్కలే మిగులును "[2] అని సున్నితమైన మానవ జీవితాన్ని ,దాని విలువను చెప్పి – దాన్ని జాగ్రత్తగా ఎలా కాపాడుకోవాలో తెలిపారు.

ప్రతి ఒక్కరి జీవితం సుఖ దు:ఖాలమయం. సుఖంగా ఉన్నప్పుడు ఎలా పొంగిపోతామో అలాగే దు:ఖం వచ్చినప్పుడు కృంగిపోక...

"నవ్వుతూ బతకాలిరా.. తమ్ముడూ
నవ్వుతూ చావాలిరా..
చచ్చినాక నవ్వలేవు ... ఎందరేడ్చినా
బతికి రావురా.. తిరిగి రావురా "[3] అని అంటారు ఆత్రేయ. ఇంకా చెప్పాలంటే –

" నవ్వేందుకే ఈ జీవితం
నవ్వొక్కటేరా శాశ్వతం
దేవుడిచ్చిన జీవితాన్ని

చివరిదాక మాసిపోని

నవ్వుతో నింపేయరా

....   ...... .......

నువ్వు వెళుతూ వున్నవాళ్ళకూ పూలబాటలు చూపరా "[4] అని అంటారు.

ఆత్రేయ మనిషి జీవితాన్ని బంగారునావతో పోల్చారు. అందుకే ఈ జీవిత యాత్రను సముద్రమనే ఈలోక మార్గాన జాగ్రత్తగా నడిపించి గమ్యం చేరుకోమంటారు. ఎలాగంటే –

" బంగారు నావ – బ్రతుకు

బంగారు నావ – దాన్ని

నడిపించు నలుగురికి మేలైన త్రోవ

అవమానం చీకటులు ఆవరించిన

అపనిందల తుఫానులు అడ్డగించినా

కదలిపోవు కాలచక్రమాగిపోవునా

నావ నడిపించు నలుగురికి మేలైన త్రోవ "[5] అని అంటారు.

డా॥ సి.నారయణరెడ్డిగారన్నట్లు – " పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికనే" ప్రశ్న ఉదయింపక మానదు. ఏమి ఆశించి ఈ సృష్టి మనకు గాలి, వెలుతురు, నీరునిస్తుంది? ఏమి ఆశించి భూమి మనకు తిండిపెడుతుంది? కాబట్టే ప్రతిఒక్కరి జీవితం మరొకరికి మేలైనదిగా, ప్రయోజనకరంగా ఉండాలని ఆశించారు ఆత్రేయ. అందుకే ఆత్రేయగారు

" ప్రతి మనిషికి వున్నది పరమార్థం

అది తెలియని బ్రతుకే అనర్థం "[6] అని తేల్చి చెప్పారు.

ఒక మంచి మాట వెనుక ఆ చెప్పేవారి జీవితానుభవం, స్వానుభవం ఉంటుంది. కొన్ని చేదు అనుభవాలను మనం చవిచూడకముందే వాటినుంచి తప్పించే మంచి మాటలు పెద్దలు చెప్పినప్పుడు వినాలి. అందుకే –

" అనుభవమున్న పెద్దల మాటలు ఆలకించాలి

మనసుకు పగ్గం తగిలించి

మంచిని తేల్చుకోవాలి – మంచిని తేల్చుకోవాలి "[7] అని చెప్తారు ఆత్రేయ.

మనిషి జీవితవాహనపు స్టీరింగ్ ఆ మనిషి చేతుల్లోనే ఉందంటారు ఆత్రేయ. ఏవిధంగానంటే –

" మనిషిగా జీవించేది నీ చేతుల్లోనే వుంది

మంచి చెడు ఏదయిన నీచేతుల్లోనే వుంది

కావాలని నిప్పుతాకితే చేయి కాలక మానదు

కాలినందుకు కర్మ అంటే గాయమేమో మానదు "[8]

మనుషులుగా మనం కొన్ని అనుసరిస్తే మనుజులం, ధన్యులం, అమరులం కాగలమని ఆత్రేయ ఈవిధంగా అంటారు...

"కావాలి హృదయము ప్రేమమయం

కలగాలి నీకుగా దానగుణం

చూపాలి పేదపై కనికరం

కాగలం మనుజులం

అణగనీ లోని అహంకారం

పరులనిన దాసులను అధికారం

వదులుకోవలె నీచుల స్నేహం

కాగల ధన్యులం
నీతి తప్పని నియమం
పొరపాటు ఒప్పుకునే ధైర్యం
పెంచుకోవలె సహనం

కాగలం అమరులం "[9] అని అంటారు. పైవిధంగా ఆచరించిన మనుషులు మహాత్ములవుతారు. మనమలా కావడమే ఆత్రేయకు కావల్సింది.

మంచి జీవితం కోసం మనిషి జీవితానికి ఆత్రేయ పది సూత్రాలను అనుసరించమని చెప్పారు. ఏమిటంటే అవి–

" ఒకటి
మానవులందరు ఒకటి
రెండూ
మంచివాళ్ళని, చెడ్డవాళ్లని
మనలో జాతులు రెండు
మూడు
మూర్ఖుల స్నేహం వీడు
నాలుగు
నలుగురి సుఖము చూడు
ఐదు వెళ్ళవలె ఐక్యమత్యమున
అందరు వుంటే అదియే మేలు ... ఒక॥
ఆరు నూరుగా నూరు ఆరుగా
అయినా కూడా అబద్ధమాడకు
ఏడు ఏడు ఏడు ఇతరులచూసి ఏడవకు .. ఒక॥
ఎనిమిది వరకు నిద్రపోకు
తొమ్మిదిపైన మేల్కొని ఉండకు
పదిమంది నిన్ను మంచివాడని
పొగిడినంతనే పొంగిపోవకు "[10] అని ఉపదేశిస్తారు. పై పది సూత్రాలను ఆత్రేయ మన కొరకే చెప్పినట్లు సూటిగా చెప్పారు. ప్రతిమనిషి ఉన్నత స్థితిని ఏవిధంగా ఆశిస్తాడో అదేమాదిరి అతని ఆలోచనలు, సుగుణాలన్నీ ఉన్నతంగానే ఉండాలంటారు ఆత్రేయ.

" గొప్పతనానికే మనసును పోనీ
గుణమే ధనము నిజ భూషణము బంగరు "[11] అని అంటారు. ఈ మాటలు నిజమేకదా! 'ఆరోగ్యమే మహాభాగ్యం ' అన్నరీతిగా 'గుణమే ధనము '.

ఒక మనిషి ధనాన్ని చూసి అతనిని మనిషిగా, మహావ్యక్తిగా గుర్తించే వారిని ఉద్దేశించి – " ధనముంటేనే మనిషనుకోకు"[12] అని అంటారు. ఆత్రేయ ప్రేమించేవారిని ఉద్దేశించి...

" ఎవరినీ ప్రేమించకు
ఎవరికీ మనసీయకు
మారిపోయే మనుషులు
మరచిపోయే మనసులు

మసలు చుండే లోకము
మారుననే ఆశ మానుము "[13] అని అంటారు ఆత్రేయగారు.

ఒకరిపై ఒకరు సాధించుకునే అత్తా కోడళ్లను ఉద్దేశించి –

" అత్తకూడా ఒకనాటి అత్తింటి కోడలే
కోడలు తానొకనాటికి అత్తకాక మానదు
అత్తాకోడళ్ళ మధ్య ఆరుపోరులు ఎందుకు
ఒకరినొకరు గౌరవించి ఒదిగుంటే పదియేలు "[14] అని వారిరువురి కలయికలో, కుటుంబంలో వెల్లివిరిసే ఆనందాన్ని గూర్చి చెప్పారు.

ఆత్రేయగారు ఇలా ఉపదేశాత్మక, ప్రబోధాత్మక గీతాలను ఎన్నింటినో రాశారు. మానవజీవితానికి ఇవి నిత్య పారాయణలుగా, సూక్తులుగా, ప్రవచనాలుగా ఉండాల్సినవి.

# పాదసూచికలు

1.ఆత్రేయ సాహితి ఏడవ సంపుటి పుట.172

2.విచిత్రబంధం

3.మాయదారి మల్లిగాడు.

4.ప్రేమతరంగాలు

5.వాగ్ధానం

6.ఆడవాళ్ళూ,మీకు జోహార్లు

7.మీనా: అమ్మమ్మమ్మమ్మ అమ్మాయి...

8.తాసిల్దారుగారి అమ్మాయి: కనబడని చెయ్యేదో నడుపుతోంది...

9.ఒక తల్లి పిల్లలు:లేదమ్మ కలిమిలో...

10.ఆలు మగలు

11.ఒక తల్లి పిల్లలు:చిట్టితల్లి రావే...

12.స్వర్గానికి నిచ్చెనలు

13.అంతేకావాలి

14.దాసి: కొత్త కాపురము నేడు...

# అసామాన్యుడు ఆత్రేయ

నాలుగు దశాబ్దాలపాటు తెలుగు సినిమా ప్రేక్షకులను పాటలతో, మాటలతో పరవశింపచేసిన మహాకవి ఆచార్య ఆత్రేయ. తెలుగు సినిమా పరిశ్రమకి పుణ్యంకొద్దీ లభించిన “కవితా సుధానిధి” ఆత్రేయ. తన ఉలిలాంటి కలంతో శిలలాంటి సినిమారంగంపై ఎన్నో చిత్రాలను, జీవిత విచిత్రాలను వివిధ భంగిమలలో అతిచక్కగా చెక్కిన అక్షరశిల్పి ఆత్రేయ. వారిపాటల్లో, మాటల్లో శృంగారాన్ని రంజింపచేసిన శృంగారకవి. కరుణంలో వేదాంతాన్ని, జీవిత సారాన్ని తెలిపిన గొప్ప వేదాంతకవి. సామాన్యమై విషయాన్ని అసామాన్యంగా, అసామాన్యమైన విషయాన్ని సామాన్యంగా చెప్పి మెప్పించగలిగే పొట్టిమాటల గట్టికవి. కొండలాంటి భావాన్ని అద్దంలా ఒదిగించి చూపగల అభినవ వేమన ఆత్రేయ.

1921, మే 7వ తేదీన నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట తాలూక మంగళంపాడు గ్రామంలో శ్రీమతి సీతమ్మ, శ్రీకృష్ణమాచార్యులనే పుణ్య దంపతులకు ఆచార్య ఆత్రేయగా పిలువబడే కిళాంబి వేంకట నరసింహాచార్యులు జన్మించారు. ‘అచార్య ’ అనేది బిరుదుకాని, విద్యార్హతను సూచించే పదవికాని,కాదు. ‘నరసింహాచార్యులనే’ పేరులోని ఉత్తరభాగం ‘ఆచార్య’ ఒక ‘ఆత్రేయ’ అనేది వారి గోత్రనామం. ఇలా ఆచార్య పదానికి గోత్రనామాన్ని కలిపి ‘ఆచార్య ఆత్రేయ’ అనే పేరును కలం పేరుగా రూపొందించుకున్నారు శ్రీ కిళాంబి వేంకట నరసింహాచార్యులు. 1940, ఫిబ్రవరి 10వ తారీఖున పద్మావతి గారితో ఆత్రేయగారికి వివాహం జరిగింది. 1942 సం॥లో ‘క్విట్ ఇండియా ’ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. చిన్నతనం నుంచి అంచెలంచెలుగా సృజనాత్మక రచనా వ్యాసంగంలో పరిణతి చెందుతూ గొప్ప ఆధునిక నాటక రచయితగా ఎదిగి పదినాటకాలు, 15 నాటికలను రచించారు. వారు రాసిన మరికొన్ని నాటకాలు లభించడం లేదు. ఆత్రేయను నాటక రంగం నుంచి సినిమారంగంవైపుకు మళ్ళించింది ‘ఈనాడు’ ‘ఎన్.జీ.వో’ నాటకాలే !

‘ఈనాడు’ నాటకం విజయవంతంగా ప్రదర్శింపబడిన తరువాత ‘సంసారం’ చిత్రానికి రచయితగా ఆత్రేయను మద్రాసు ఆహ్వానించారు. కొన్ని కారణాలవల్ల ఆ చిత్ర దర్శకుడు కూడా మారి మరో రచయితను నిర్మాతలు ఎన్నుకున్నారు. అప్పటికే ఆత్రేయ సంభాషణల పట్ల మంచి అభిరుచిని పెంచుకున్న కె.యస్.ప్రకాశరావుగారు తాను దర్శకత్వం వహించే ‘దీక్ష’ చిత్రం ద్వారా ఆత్రేయను తెలుగు చిత్ర పరిశ్రమకు పాటలు, మాటల రచయితగా పరిచయం చేశారు.

“ పోరాబాబు పో.. పోయిచూడు ఈలోకం పోకడ ” అని ‘ దీక్ష ’ సినిమాకి ఆత్రేయ మొట్టమొదటిగా పాటనురాశారు. ఇదే సినిమాలోని ‘ఏమౌతుందో ఇంకేమౌతుందో’’ అనే పాటలో

“తప్పోదినా అనివుంటే అప్పుడే మన్నించేది

పిరికి వెధవలా నేను పారిపోయి వచ్చానే ” అనే పాదాలు పూర్తివచనాలు.

ఇది పాటకాదని ఆరోజుల్లో చాలామంది ఎగతాళి చేశారట ఆత్రేయని. అయినప్పటికీ ఆత్రేయ ఆ మాటల్ని పట్టించుకోకుండా రచనల్ని కొనసాగించారు. ఆత్రేయ సినిమా రంగంలో ప్రవేశించేనాటికి ఇంకా బాల్యదశలోనే వున్న సినిమా పాపాయికి మాటలు, పాటలు నేర్పిన చతురుడు ఆత్రేయ.

ప్రేక్షకునికి పాటైనా, మాటైనా అప్పటికప్పుడు ఏవిధమైన ఇబ్బంది లేకుండా అర్థమయ్యేలా ఉండాలి కాని నిఘంటువులు పట్టుకొని సినిమాలు చూడడానికి వెళ్ళేలా ఉండకూడదని ఆత్రేయగారి భావన. అందుకే ఆయన పాటల్లో, మాటల్లో, జన వ్యవహారంలోని అతితేలిక పదాలు – వాడుక పదాలు – సంక్షిప్తత – సరళిత ఉంటాయి.

“ రాళ్ళలో ఇసకల్లో రాశాము ఇద్దరి పేర్లు

కళ్ళుమూసి తిన్నగా కలిపి చదువుకో

ఒక్కసారి కలలలోన తీయగా గురుతు తెచ్చుకో ”[1] అనే పాటలో ఆత్రేయ ఉపయోగించినవి అతి తేలికపదాలు – వాడుకపదాలు. పరస్పరం మాట్లాడుకుంటునట్లు ఉంటుంది. అదేవిధముగా సంక్షిప్తత గూర్చి చెప్పాల్సి వస్తే –

"పెళ్ళంటే పందిళ్లు సందళ్లు

తప్పెట్లు తాళాలు తలంబ్రాలు

మూడే ముళ్ళు ఏడే అడుగులు

మొత్తం కలిపి నూరేళ్లు "[2] అని మూడు ముక్కల్లో చెప్పారు.

ఆత్రేయగారి రచనలో మరో విశేషం గొప్పభావం. కొద్ది వాక్యాలలోనే ఆ భావం గంభీరంగా పొదగబడి వుంటుంది.

" పూలదండలో దారం దాగుందని తెలుసును

పాలగుండెలో ఏది దాగుందో తెలుసునా

నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి

ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా "[3] అని గొప్పభావాన్ని పలికిస్తారు. మనిషి గొప్ప అనుభూతికి లోనైనప్పుడు కళ్ళవెంట అప్రయత్నంగా వచ్చిరాలేవి ఆనందభాష్పాలైతే అదే మనసుకు గాయమైనప్పుడు వచ్చేవి కన్నీటి భాష్పాలు. ప్రతి మానవునిలో ఇవి సహజంగానే వుంటాయి... వస్తాయి. ఇది అందరికీ తెలిసినవిషయమే. అయితే ఆ కన్నీటి వెనుకగల కారణం ఎదుటివారికి తెలియదు. అందుకే " ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా" అని రాశారు. ఇలా మనం చూసే వాటిని కూడా పాటలలో ప్రయోగించి మెప్పించగల గొప్పకవి. కాబట్టే –

" నవ్వు నవ్వుకు తేడా వుంటుంది

నవ్వే అదృష్టం ఎవరికుంటుంది

ఏ కన్నీరైనా వెచ్చగా వుంటుంది..." అని సహజమైన విషయాన్ని గొప్పభావనతో పాటలో పొదిగించగలిగారు.

ఆత్రేయగారి భావనలు మనకు ఒక్కోసారి అద్దాలులాగా వుంటాయి. ఈ అద్దమనే భావనలో మన మనస్తత్వ స్వరూపం స్పష్టంగా కన్పిస్తుంది. ఏవిధంగా అంటే –

" అనుకున్నామని జరగవు అన్నీ – అనుకోలేదని ఆగవు కొన్ని

జరిగేవన్నీ మంచికని – అనుకోవడమే మనిషి పని "[4] అని మనిషి మనస్తత్వాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఈ భావన, మనస్తత్వం, ప్రతిమనిషిలో ఉన్నప్పటికీ, తెలిసినప్పటికీ దాన్ని పట్టుకొని పాట రూపంలో ఆవిష్కరించి చూపిన మొదటి కవిగా ఆత్రేయను ప్రస్తావించక తప్పదు.

భావవ్యక్తీకరణ దృష్టితో ఆత్రేయశైలిని పరిశీలిస్తే వేమన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వేమన పద్యంలో మొదటి రెండు పాదాలు ఏవిధంగా ఉపమానంగా కన్పిస్తాయో అదేవిధంగా ఆత్రేయగారి పాటల్లో కూడా ఆ లక్షణాలు కన్పిస్తాయి.

ఉదాహరణకి " అంతులేని కథ " చిత్రంలో

" కళ్ళలో వున్న దేదో కనులకే తెలుసు

రాళ్ళలో వున్ననీరు కళ్ళకెలా తెలుసు

నాలో వున్న మనసూ నాకుగాక ఇంకెవరికి తెలుసు " అని రాస్తారు...

ఇక్కడ ఆత్రేయ చెప్పదలచుకున్న భావం ఏమిటంటే – " కష్టంగాని – నష్టంగాని, ఆనందంగాని – విషాదంగాని ఎవరి మనసులో ఉన్న బాధలు, భావాలు వాళ్ళకే తెలుస్తాయి అని చెప్పడానికి ఉపమానంగా " కళ్ళలో వున్నదేదో కనులకే తెలుసు" అని రాస్తారు. అంతేగాని మనదికాని, ఎదుటివారిలోని భావనలు ఖచ్చితంగా మనకెలా తెలుస్తాయి ? " అనే ప్రశ్నను " రాళ్ళలో వున్న నీరు కళ్ళకెలా తెలుసు" అనే వాక్యంలో పలికిస్తారు. ఇలా వేమన పద్యాలకున్నంత పదును, బరువు ఆత్రేయ పాటలకు ఉన్నదని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

ఆత్రేయ భావాలను కొన్నింటిని పరిశీలిస్తే ఆసక్తిగా ఉంటాయి. ఆ భావాలకు మానవీకరణను చేసారు తన పాటల్లో.

" నీ వలపే తలుపును తట్టింది – నా

మనసుకు మెలకువ వచ్చింది – నా

వయసుకు గడయను తీసింది ""[5] అని రాశారు. ఇక్కడ ఆమె 'వలపు'ను అతని 'మనసు'ను ప్రాణమున్న వస్తువుగా (జీవిగా) చేసి గొప్పభావాన్ని క్రియా ప్రధానంగా ఆత్రేగారు చూపిస్తారు.

ఆత్రేయ ప్రతిదానిని ఒక ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తారు. అది సాధారణమైనదే కావచ్చు. వారి దృష్టికెళ్ళగానే అది అసాధారణమైన భావంగా రూపొందుతుంది.

మేఘాలు ప్రయాణిస్తూ చందమామను కొంతసేపు కమ్మివేస్తాయి. చందమామను కమ్మివేయబడిన మేఘాలు ప్రయాణిస్తుండడం వల్ల చందమామ కొంత భాగం అస్పష్టంగాను మిగిలిన భాగం స్పష్టంగాను కన్పిస్తుంది. మనందరం చూసిన / చూస్తుండే దృశ్యమే ఇది. ఇలాంటి దృశ్యాన్ని చూసిన ఆత్రేయ మనసులో పెట్టుకొని ప్రేయసీ ప్రియులు వెన్నెలరాత్రి పాడుకునే పాటకి కవిహృదయంతో ఏమిరాశారాంటే..

" పచ్చికాబయలులోన
మచ్చికగా మనముంటే
సిగ్గులేని చందమామ
చాటు గుండిచూస్తాడు ""[6] అని భావాత్మకంగా రాశారు. కవుల కళాత్మక దృష్టేకాదు. వారి తలంపులు కూడా ఒక్కోసారి తార్కికంగా వుంటాయి.

ఉదాహరణకు :

" రవినే మింగిన రాక్షస రాహువు
వెన్నెల చెలికాడవుతాడా .. ?
కాటేసే కరినాగు కోరలో
గరళం కాక పాలుంటుందా..?
వెన్నెల బ్రతుకును చీకటిచేసిన
అమావాస్యకు హృదయం వుందా ""[7] అని ప్రశ్నిస్తారు.

ఆత్రేయగారి పాటలలో కనిపించే మరో అంశం ఏమిటంటే " మినీ కవితాధోరణి". పాటలోని వచనాలలో కొంతభాగం మినీకవితలా ఉంటుంది. ఉదాహరణకు 'కొడుకు – కోడలు ' చిత్రాన్ని పరిశీలిస్తే...

" ప్రేమకన్నా త్యాగం మిన్న –
అది మిగిలిపోనీ – నా జీవితాన –
నన్నూ రగిలిపోనీ – నీప్రేమలోన " అని రాశారు.

ఆత్రేయ శబ్దాలంకారాలతో,అర్థాలంకారాలతో పాటలను రమ్యంగా రచించడం జరిగింది.

" కాలమనే నదిలో కదిలే కర్మమనే నావ మీద
ఎవరితోడు యెన్నాళ్లున్నా చివరితోడు నువ్వేలే.."[8] అని అర్థాలంకారమును ఉపయోగించారు. ఇలా అర్థాలంకారాలనే కాక శబ్ధాలంకారాలనుకూడా ఎన్నింటినో ఉపయోగించి పాటలు రాశారు.

ఇలా సుమారు 2,000 పాటలు, 200 చిత్రాలకు మాటలు రాశారు. 'వాగ్దానం' చిత్రానికి దర్శకునిగా – నిర్మాతగా, రుణానుబంధం, మూగమనుషులు, డా॥ ఆనంద్ మొదలైన చిత్రాలకు కధారచయితగా ఆదర్శ కుటుంబం, మంచి మనుషులు, కన్నతల్లి, సతీసావిత్రి (రామారావు, వాణిశ్రీ) చిత్రాలకు స్క్రీన్‌ప్లే రచయితగా ఆదర్శం, కోడెనాగు, భామాకలాపం చిత్రాలలో నటుడిగా వివిధ ప్రక్రియలలో పనిచేశారు.

ఇన్ని సాహితీ కుసుమాలను తెలుగువారికి అందించిన మహాకవి, మరపురాని మరువలేని కవి 'ఆచార్య ఆత్రేయ' మనలను దు:ఖసాగరంలో ముంచి 1989వ సం॥ సెప్టెంబరు 13వ తారీఖు రాత్రి 10 గంటలకు భువిని విడిచి దివికి వెళ్ళారు.

సినిమా రచయిత అనేవారు సాహిత్యపరంగా కవిగా ఆత్రేయను ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. రచన చేసేటప్పుడు వారి తపన తపనకాదు ! డైలాగ్స్ విషయంలో అయితే స్క్రిప్ట్ ఎప్పుడో అప్పగించినా, షూటింగ్ జరుగుతున్నా స్క్రిప్ట్‌లోని దానికందే మెరుగైన మాటలు స్ఫురిస్తే దర్శక నిర్మాతలను ఒప్పించి ఆ కొత్త సంభాషణను నటులచేత పలికిస్తారు. అంటే కొందరి రచయితల మాదిరి స్క్రిప్ట్ అప్పగించి పని అయిపోయినదని చేతులు దులుపుకొనే స్వభావ ఆత్రేయగారిది కాదు . నూటికి నూరుశాతం వారికి నచ్చితేగాని సంతోషిస్తారు. ఇంతెందుకు ‘ శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం’లో “ ఎవరో..? అతనెవరో...?” అనే పాటలో “కరుణ జూపి కబురు తెలిపి రమ్మనవా” అనే వాక్యం పొరపాటున ‘కబురు’ అనే ఉర్దూ పదాన్ని వాడారు. ఆ సినిమా పౌరాణిక చిత్రం. అయితే భాషాపరంగా చూస్తే ఆ చిత్రంలో ఉర్దూ పదప్రయోగమేమిటని విమర్శ చేయవచ్చు. అప్పటికి సినిమా విడుదలై ఆడుతుంది. తన తప్పును గుర్తించిన ఆత్రేయ చేసిన తప్పును గూర్చి మల్లాది రామకృష్ణశాస్త్రి దగ్గర బాధపడుతూ చెప్పగా “ ఆ కాలంలో బీబీనాంచారి వుందికదా – తప్పేముంది” అని చెప్పిన తర్వాతగాని ఆత్రేయకు నిద్రపట్టలేదని ఆత్రేయగారి శిష్యుడు శ్రీ జె.కె.భారవి చెప్పారు.’[9] దీన్నిబట్టి ఆత్రేయగారు ఎంత సిన్సియర్ రచయితో తెలుస్తుంది. నేటి రచయితలకు ఆదర్శనీయులు ఆత్రేయ.

ఆత్రేయుడంటే చంద్రుడు అని అర్థం. ఆకాశంలో చంద్రుడున్నంత కాలం – ఆత్రేయ సాహిత్యం ఈ సాహితీలోకంలో ఉన్నంతకాలం ఆత్రేయగారు బ్రతికే ఉంటారు.

“చచ్చి బ్రతికున్నవాళ్ళు కొద్దిమంది”’[10] అని వారు రాసిన ఆ పాటకు ఉదాహరణగా వారినే చెప్పుకోవచ్చు. ఇలాంటి మహానుభావుడు, మహాకవి భౌతికంగా మనమధ్య లేకపోయినప్పటికీ మనమనుసుల్లో ఇంకా బ్రతికేవున్నాడు... వుంటాడు!

# పాదసూచికలు

1.సీతారామ కళ్యాణం
2.త్రిశూలం
3.మూగమనసులు: ముద్దబంతి పువ్వులో...
4.మురళీకృష్ణ
5.కొడుకు కోడలు: చేయి చేయి తగిలింది...
6.అర్ధాంగి: సిగ్గేస్తుందోయ్ బావ...
7.హేమా హేమీలు
8.అనురాగ దేవత: చూసుకో పదిలంగా...
9.శ్రీ .జె.కె.భారవితో ముఖా ముఖి. 16.11.1998
10.శాంతి నివాస్

ఆత్రేయ జీవితం-వ్యక్తిత్వం-సాహిత్యంపై

# ప్రముఖుల అభిప్రాయాలు

1. " ఆత్రేయ అంటే తెలుగు సాహితీ రంగంలో సాంఘిక నాటక యుగకర్త. ఆత్రేయ అంటే తెలుగు సినీ జగత్తులో మాటల పసిడికోట, పాటల ముత్యాల పేట " – డా॥ సి.నారాయణరెడ్డి
2. " బరువైన తేలిక పదాలతో మనసుకు, మనిషికి కొత్త భాష్యాన్ని చెప్పినవారు ఆత్రేయ "– డా॥ పర్వతనేని సుబ్బారావు
3. " ఆత్రేయగారి డైలాగ్‌కి ట్యూన్ కడితే పాట, ఆయన పాటని ట్యూన్ లేకుండా చదివితే డైలాగ్ " – సత్యానంద్
4. " ప్రతిభ, పట్టుదల కలిస్తే ఆత్రేయ అని చెప్పుకోవచ్చు " – డా॥ పైడిపాల
5. " శృంగారమైన, మమకారమైనా తేలిక పదాలతో చదువుకున్నవాణ్ణి, చదువులేనివాణ్ణి గుండె లోతుల వరకూ కదిలించగల ప్రతిభ ఆత్రేయది " – గొల్లపూడి మారుతీరావు
6. " గద్దర్ లాంటి ప్రజా గాయకుడు మరొకరు కనిపించరు. ఆత్రేయ వంటి రచయిత మరొకరు కనిపించరు" – డా॥ రామ్మోహనరాయ్
7. " ఆత్రేయ సామెతల్లా మిగిలిపోయే మాటలు, పాటలు మిగిల్చాడు" – డా॥ సి.నారాయణరెడ్డి
8. " ఎన్ని వచ్చినా ఒక డైలాగ్ విన్నా, ఒక పాట విన్నా ' ఇది ఆత్రేయది' అని చెప్పకుండానే చెప్పే గుణం కలవి ఆత్రేయ రచనలు " – శ్రీ రావు గోపాలరావు, శ్రీ చింతా సూర్యనారాయణ
9. " ఆత్రేయ వ్రాసిన పాటల్లో ప్రతి పల్లవి తీసుకొని ఒక కథ వ్రాయవచ్చు. అంత గంభీరమైన భావస్ఫోరకమైన భాష ఆత్రేయది " – కీ॥శే॥ కె.యస్.ప్రకాశరావు
10. " ఈ నాటి వరకూ జగపతివారి పాటలంటే అవి ఆత్రేయగారి మాటలతో నిండిన ముత్యాల మూటలు. రతనాల పాటలు." – శ్రీ వి.బి.రాజేంద్రప్రసాద్
11. " ఆత్రేయ వ్రాసిన పాటలన్నీ ప్రజల మనోభావాలను పుణికి పుచ్చుకుని ఉండేవి." – కీ॥శే॥ ఎన్.టి.రామారావు
12. " తెలుగు సినిమా పాటకో మనసుని, ఉన్నతమైన భావాన్ని ఇచ్చిన ఘనత ఆత్రేయకు దక్కుతుంది." – కె.రామలక్ష్మి ఆరుద్ర
13. " ఆచార్య ఆత్రేయ పాటలు – శబ్దం రవళించే, అర్థం పరిమళించే స్వర పారిజాతాలు " – డా॥ పర్వతనేని సుబ్బారావు
14. "ఆత్రేయ మాటకు తాళం వేస్తే పాటవుతుంది. ఆయన పాటకు తలుపు తీస్తే మాటవుతుంది" – శ్రీ తోటపల్లి మధు
15. " ఆత్రేయగారి పాటలు, మాటలు ఎప్పటికీ మరువరానిది – మరువలేనివి. " – డా॥ డి.రామానాయుడు
16. " సినీ సాహితీరంగంలో అపర శ్రీనాథుడు. తెలుగు సినిమాపాటకు సాహిత్య మందిరంలో పట్టాభిషేకం చేయించినవాడు ఆత్రేయ" – గొల్లపూడి మారుతీరావు
17. " మాట, పాట, పద్యం. ఈ మూడింటి యొక్క త్రివేణీ సంగమం ఆత్రేయ" – డా॥ పైడిపాల
18. "మామూలు మాటలతో పాటలని పొదగవచ్చు అనే విషయాన్ని మొట్టమొదటిగా ప్రదర్శించి చెప్పింది, ఆచరించి చూపింది ఆచార్య ఆత్రేయ. " – శ్రీ కె.జగ్గయ్య.

19. " సినీ గీతాల్లో ఆత్రేయ కనబరచిన అనన్య ప్రతిభ, భావ వ్యక్తీకరణ ఆయన ఊహాచాతుర్యానికి నిదర్శనం " -కీ॥ శే॥ ఎన్.టి.రామారావు

20. " బరువైన భావాల కొండలను చిటికెను వేలుపై గోవర్ధన గిరి వలె సునాయాసనంగా తేలికమాటల్లో వహించడం, వచించడం గీతాచార్యుడికే (ఆత్రేయ) తెలుసు." - శ్రీ వేటూరి సుందరరామమూర్తి

21. అలతి మాటలలో అనల్పమైన భావాన్ని, మూగ మనసు వేదనల్ని మనసుకు హత్తుకుపోయేలా రాయడం, ఏడిపించడం ఆత్రేయ తప్ప మరొకరు చేయగలరా అంటే ఊహూ.. అది ఆత్రేయకే చెల్లింది.."

- డా॥ శ్రీమతి మొదలి సరస్వతి

22. " వేమన తర్వాత ఆత్రేయ పుట్టాడు. అంత తేట తెలుగుదనం ఉంది ఆయన రచనలలో " - శ్రీ కృష్ణంరాజు

23. " భాషను అదుపు చేయడంలోను, భావాన్ని అదుపు చేయడంలోను తిమ్మెర వంటి తేలికమాటలతో తేనెలు, తీయని తావులు, వెదజల్లడంలోనూ ఈ ఆచార్యుడు (ఆత్రేయ) తిక్కనకు వారసుడు."

- శ్రీ వేటూరి సుందరరామ్మూర్తి.

24. " మానవ జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, గెలుపు ఓటములను అనుభవాలను ప్రతిబింబిస్తూ మనసుల్ని కదిలించే విధంగా ఆయన రాసిన పెక్కు పాటలు చిరస్మరణీయాలై నిలిచాయి." - కీ.శే.ఎన్.టి.రామారావు

25. " ఆత్రేయలా మాటలు రాయడం మాటలు కాదనే సంగతి నాటక,చలనచిత్ర రంగాలలో సర్వులూ అంగీకరించిన సత్యం. కొండల్లాంటి మానసిక స్పందనల్ని మాటలనే అద్దాలలో ఒదిగించగల నేర్పరి, కూర్పరి ఆచార్య ఆత్రేయ."

- డా॥ పైడిపాల

26. " ఆత్రేయ పాటల్లో లోతైన భావాలు, జీవిత సత్యాలు, ఎంతో మేధస్సు ఇమిడి వున్నాయి. ప్రజల ఆలోచనలు, ఊహాగానాలు ఆయన పాటల్లో పుట్టిపడుతుంటాయి. మనిషి జీవిత అనుభవాలు, చీకటి, వెలుతురు, విజయాలు, అపజయాల గురించి ఆయన హృదయాలకు హత్తుకునే విధంగా పాటలు రాసారు." - కీ.శే. ఎన్.టి.రామారావు

27."తెలుగు సాహిత్యం బ్రతికున్నంత వరకు ఆత్రేయ బ్రతికే వుంటాడు. ఆయన చిరంజీవి"-శ్రీ మురళీ మోహన్.